తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## జనవరి 7న స్థానికుల దర్శనం

### -జనవరి 5న టోకెన్లు జారీ



తిరుమల,డిసెంబర్ 29ప్రభాతవార్తప్రతినిధి: తిరుమల,తిరుపతి నగరం, రూరల్,చంద్రగిరి, రేణిగుంట మండలాల్లోని స్థానికులకు ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనభాగ్యం రెండవవిడత జనవరి 7వతేదీ కల్పిస్తున్నారు. ఇందుకోసం జనవరి 5వతేదీ ఆదివారం ఉదయం తిరుపతి మహతి ఆడిటోరియంలోని కౌంటర్లలో, తిరుమలలోని కౌంటర్‌లో ఉచిత టోకెన్లు జారీ చేస్తారు. టోకెన్లు తీసుకున్న భక్తులకు జనవరి 7వతేదీ మంగళవారం ఉదయం స్థానికులకు గోవిందుని దర్శనం కల్పిస్తారు. ఈ దర్శనానికి స్థానికుల కోటా క్రింద ఆధార్‌కార్డు ఆధారంగా ఉచిత దర్శన టోకెన్లను టిటిడి జారీ చేస్తోంది. భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని టిటిడి తెలిపింది.

## గోవిందుని సేవలో డిజిపి ద్వారక తిరుమలరావు

తిరుమల,డిసెంబర్ 29ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవేంకటేశ్వరస్వామిని కుటుంబంతో కలసి ఆదివారం ఉదయం రాష్ట్ర డిజిపి ద్వారక తిరుమలరావు దర్శించుకున్నారు. దర్శనానంతరం టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. డిజిపి వెంట తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్ఓ శ్రీధర్ ఉన్నారు.



## కొత్త సంవత్సరాన్ని ప్రశాంతంగా జరుపుకుందాం

### జిల్లా ఎస్పి సుబ్బరాయుడు



తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 29, ప్రభాతవార్త

కొత్త సంవత్సరాన్ని ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకుందామని జిల్లా ఎస్పి సుబ్బరాయుడు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి సుబ్బరాయుడు మాట్లాడుతూ డిసెంబర్ 31 రాత్రి తిరుపతి నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా రోడ్లు నందు చెక్ పోస్టులు, పికెట్‌లను ఏర్పాట్లు చేసి రాత్రి 10 గంటల నుండి వాహనాలను తనిఖీ చేయడం ప్రారంభించి, తెల్లవారుజామున వరకు కొనసాగుతుందన్నారు. వైన్ షాపులు, బార్‌లను ప్రభుత్వం నిర్దేశించిన నిర్ణీత సమయంలో మూసివేయాలన్నారు. గరుడ వారధి, యూనివర్శిటీ ఫ్లై ఓవర్‌లను డిసెంబర్ 31వ తేది రాత్రి 10 గంటలకు మూసి వేయబడున్నారు. తిరుపతి పట్టణములో రోడ్లపైన, ఫ్లై ఓవర్ పైన నూతన సంవత్సరం వేడుకలు నిషిద్ధం అన్నారు. స్పెషల్ డ్రైవ్‌లో బ్రీత్ ఎనలైజర్లకు పట్టుబడిన వ్యక్తులను మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి రిమాండ్‌కు పంపారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా సాంస్కృతికంగా కించపరిచేలా అశ్లీల నృత్య కార్యక్రమాలు, డిజె సౌండ్స్, రికార్డింగ్ డాన్స్‌లు నిర్వహించేందుకు అనుమతులు లేవు. నూతన సంవత్సర వేడుకలను సాకుగా చూపి బైక్‌లు, కార్లను రేసింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం సేవించి వాహనం నడిపితే ఎంవి చట్టం ప్రకారం వాహనాలు సీజ్, రూ. 10,000, లేదా 6 నెలల జైలు శిక్ష, డ్రైవింగ్ లైసెన్స్ కెన్సెల్ చేయడం జరుగుతుందన్నారు. మైనర్లు వాహనం నడపకూడదు. మైనర్లు ఎవరూ వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు, వాహన యజమానులు భాద్యత తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో కూడా మోటార్ సైకిల్ పై త్రిపుల్ రైడింగ్ వెళ్ళకూడ దన్నారు. ద్విచక్ర వాహనాల సైలెన్సర్‌లను తొలగించకూడదని, శబ్ద కాలుష్యాన్ని నివారించాలన్నారు. వాహనాలను ఓవర్ స్పీడ్‌లో నడపడం, ప్రమాదకరమైన డ్రైవింగ్, బహిరంగ ప్రదేశాల్లో రేసింగ్ చేయడం వంటివి ఎంవి చట్టం ప్రకారం శిక్షార్హులవుతారన్నారు.

## నేటి రాత్రి పిఎస్ఎల్‌వి-సి60 ప్రయోగం

### - షార్‌లో కొనసాగుతున్న కౌంట్‌డౌన్- ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ ఆధ్వర్యంలో ప్రయోగ ఏర్పాట్లు
### - షార్‌కు ఇది 99వ రాకెట్ కావడంతో ప్రతిష్టాత్మకం






శ్రీహరికోట (తడ), డిసెంబర్ 29 ప్రభాతవార్త

శ్రీహరికోట నుంచి సోమవారం రాత్రి 9.58 గంటలకు పిఎస్ఎల్‌వి-సి60 రాకెట్‌ను ప్రయోగిస్తున్నారు. ఇందుకు సంబంధించి ఆదివారం రాత్రి 8.58 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభమయింది. ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ ఇప్పటికే షార్‌ను చేరుకొని శాస్త్రవేత్తలకు సూచనలందజేస్తున్నారు. ఆయన ఆధ్వర్యంలోనే ఈ రాకెట్ ప్రయోగం జరగనుంది. భవిష్యత్‌లో భారత్‌కు అంతరిక్ష పరిశోధనలో ఎంతో ఉపయోగపడుతుందని ఈ రాకెట్‌లో విలువైన ఉపగ్రహాలు, ఉపకరణాలు ఉంచి ప్రయోగిస్తున్నారు. డాకింగ్ పరిశోధనల కోసం స్పేడెక్స్-ఎ, స్పేడెక్స్-బి ఉపగ్రహాలు ఇందులో కీలకం. ఇస్రో రూపొందించిన మరో 14 విలువైన పేలోడ్లు దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలు, ప్రైవేటు సంస్థలు రూపొందించిన 10 పేలోడ్లను కూడా ఈ రాకెట్ ద్వారానే ప్రయోగిస్తున్నారు. ఇందులో ఒక్కొక్కటి ఒక్కొక్క విలువైన సమాచారం భారత అంతరిక్ష పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలకు అందిస్తాయి.

#### ఇది పూర్తి స్వదేశీ

పిఎస్ఎల్‌వి-సి60 రాకెట్, అందులో ప్రయోగించే ఉపగ్రహాలు, పేలోడ్లు అన్నీ పూర్తి స్వదేశీ కావడం విశేషం. అన్ని ఉపగ్రహాలు మన దేశీయులే రూపొందించారు. మన ప్రయోజనాల కోసమే చాలారోజులు తర్వాత ఒక రాకెట్ ప్రయోగం జరుగుతోంది. ఈ ప్రయోగం పూర్తయిన తర్వాత షార్‌కు మరిన్ని కొత్త ప్రాజెక్టులు వస్తాయని స్థానికులు నమ్ముతున్నారు. మరో నాలుగు వారాల వ్యవధిలో షార్ నుంచి 100వ ప్రయోగం జరుగుతున్న కారణంగా శ్రీహరికోట మరోసారి ప్రపంచంలో గుర్తింపు తెచ్చుకునే అవకాశం ఉందని, ఆ ప్రయోగ సమయంలో షార్‌కు అభివృద్ధి వరాలు అందుతాయని నమ్ముతున్నారు. ఇప్పటికే శ్రీహరికోట పటిష్టమైన బందోబస్తుతో నిండిపోయింది. రాకెట్ ప్రయోగం కారణంగా కేంద్ర పారిశ్రామిక భద్రత దళాలు, తిరుపతి జిల్లా పోలీసు యంత్రాంగం గట్టి నిఘా ఏర్పాటు చేసింది.

## ప్రమాదం అంచున శ్రీపురం



పూతలపట్టు, డిసెంబర్ 29 ప్రభాతవార్త:

పూతలపట్టు మండలం పి.కొత్తకోట పంచాయతీ పరిధిలోని శ్రీపురం గ్రామం ప్రమాదం అంచున కొట్టుమిట్టాడుతోంది. శ్రీపురం గ్రామం బెంగళూరు-నాయుడుపేట జాతీయ రహదారి ప్రక్కన వున్నది. ఆరు సంవత్సరాల క్రితం నాయుడుపేట-బెంగళూరు జాతీయ రహదారి పనులు చేపట్టి పూర్తి చేశారు. ఈ క్రమంలో అప్పట్లో జాతీయ రహదారి ప్రక్కనే వున్న శ్రీపురం గ్రామం వద్ద రోడ్డు నిర్మాణం కోసం అక్కడ వున్న రోడ్డును వెడల్పు చేశారు. ఇటీవల వర్షం కురవడంతో ఈ ప్రాంతం అధ్వాన్నంగా తయారైంది. ఇక్కడి విద్యుత్ స్తంభాలు, నివాసాలు కూలిపోయే స్థితికి చేరుతున్నాయి. ఈ విషయంను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్ళిన ఫలితం మాత్రం వుండటం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు సత్వరం స్పందించి హైవే నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌తో తమ ఇళ్ళ ప్రక్కగా గోడలు నిర్మించి ఇవ్వాలని, గోడలు నిర్మించకపోవడంతో విద్యుత్ స్తంభాలు, ఇంటి గోడలు ఎప్పుడైనా కూలిపోయే స్థితికి చేరాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంను అధికారులు పట్టించుకుని త్వరితంగా సమస్యను పరిష్కరించి ఇక్కడి ప్రజల కష్టాలను తీర్చాలని ఆ ప్రాంత వాసులు వేడుకుంటున్నారు.

## నిరుపేదపిల్లల విద్యకు ఎస్‌బిఐ గణనీయమైన సహకారం

### -బాలమందిర్ విద్యార్థులకు రూ.16.64లక్షల యూనిఫాం




తిరుపతి,డిసెంబర్ 29ప్రభాతవార్త:

ఆర్థికరంగంలోనేగాక సామాజికసేవలో కూడా భారతీయ స్టేట్ బ్యాంకు తనవంతుగా సహకారం, సేవలందిస్తుందని ఎస్‌బిఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులుశెట్టిగ, సిజిఎం రాజేష్‌కుమార్ పటేల్ తెలిపారు. ఇందులో భాగంగా ఎస్‌బిఐ అమరావతి సర్కిల్ పరిధిలో ఆదివారం ఉదయం కార్పొరేట్ రెస్పాన్సిబిలిటీ(సిఎస్ఆర్) క్రింద టిటిడి ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్వీ బాలమందిరంకు తనవంతుగా వితరణ చేసింది. ఇక్కడ చదువుకుంటున్న నిరుపేద పిల్లలకు అవసరమైన 16.64లక్షలు రూపాయలు విలువైన యూనిఫామ్‌లను ఎస్‌బిఐ తరపున అందజేశారు. ఎస్‌బిఐ సిజిఎం రాజేష్‌కుమార్‌పటేల్, జిఎం సంజయ్‌కుమార్, డిజిఎం జి.లేఖామీనన్,బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు. ఎస్‌బిఐ వితరణకు బాలమందిరం ఉపాధ్యాయులు, విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు.

## ఆర్టీసీ బస్టాండు వైపు వచ్చి పోరాదా డిఎం గారూ...!

### -ప్రయాణీకుల వేడుకోలు



మౌళిక వసతుల్లేక బురదమయంగా వున్న ఆర్టీసీ బస్టాండు

చౌడేపల్లి, డిసెంబర్ 29 ప్రభాతవార్త

నిత్యం ప్రయాణీకులతో రద్దీగా వుండే పలమనేరు ఆర్టీసీ బస్టాండు మౌళిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. తేదేపా ప్రభుత్వ హయాం 2002లో అప్పటి మంత్రులు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, కడియం శ్రీహరి, కోడెల శివప్రసాద్ రావు, దామంచర్ల ఆంజనేయులు, ఎంపి నూతనకాల్వ రామకృష్ణారెడ్డిలు ఆర్టీసీ బస్టాండును ప్రారంభించారు. అయితే అప్పటి నుంచి ఎలాంటి ఆలనా పాలనకు నోచుకోలేదు. కొన్నాళ్ళ నుంచి పలమనేరు మార్గంలో తిరిగే ఆర్టీసీ సర్వీసులు మాత్రమే ఇక్కడ నిలిపేవారు. అయితే వారం రోజుల నుంచి తిరుపతి, పుంగనూరు వైపు వెళ్ళే ఎర్రబస్సులు సైతం బస్టాండులోకి వెళ్ళే విధంగా పుంగనూరు డిపో మేనేజర్ సుధాకరయ్య చర్యలు తీసుకొన్నారు. దీంతో ప్రయాణీకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా పలమనేరు ఆర్టీసీ బస్టాండులో అన్ని వసతులు వున్నప్పటికీ వాడుకలో లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మరుగుదొడ్లు లేక వారు పడే అగచాట్లు వర్ణణాతీతంగా వున్నాయి. స్థానికులు ముందుకొచ్చి ఏర్పాట్లు చేస్తామన్నప్పటికీ పలమనేరు ఆర్టీసీ డిపో అధికారులు పట్టించుకోలేదన్న విమర్శలున్నాయి. బస్టాండు బురదమయంగా వుండి బస్సులు నిలిపేందుకు సైతం స్థలం లేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. బస్సులొస్తే సౌకర్యాలు సమకూర్చుతామన్న అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని స్థానికులు, ప్రయాణీకులు కోరుతున్నారు.

## నేరాలు తగ్గుముఖం

### వార్షిక నేర నివేదికలో ఎస్పీ మణికంఠ చందోలు

చిత్తూరు, డిసెంబర్ 29 ప్రభాతవార్త:

జిల్లాలో గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది నేరాలు తగ్గుముఖం పట్టాయని, కమ్యూనిటీ పోలీసింగ్‌ను పటిష్టంగా అమలు చేయడంతో శాంతిభద్రతలు స్థిరంగా వున్నాయని ఎస్పీ మణికంఠ చందోలు పేర్కొన్నారు. చిత్తూరు పోలీస్ గెస్ట్‌హౌస్‌లో ఆదివారం ఎస్పీ మణికంఠ చందోలు వార్షిక నేర నివేదికను విలేకరుల సమావేశం నిర్వహించి వివరించారు. ఈ ఏడాది కాలంలో రూ.6.17 లక్షల ప్రాపర్టీ దొంగతనానికి గురి కాగా అందులో రూ.2.69 లక్షల ప్రాపర్టీని రికవరీ చేసి దొంగతనానికి గురైన ప్రాపర్టీలో 43.67 శాతం రికవరీ చేయడం జరిగిందని ఎస్పీ పేర్కొన్నారు. అలాగే ఎర్రచందనం అక్రమ రవాణ కట్టడి చేయడంలో భాగంగా ఈ ఏడాది ఆరు కేసులు నమోదు చేసి 19 మంది ఎర్రచందనం స్మగ్లర్లు, మేస్త్రీలు, కూలీలను అరెస్టు చేసి వారి నుండి 2,268 కేజీల బరువు గల 121 ఎర్రచందనం దుంగలను, 7 వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. పోలీసులకు పట్టుబడిన ఎర్రచందనం విలువ 68 లక్షల రూపాయలు వుంటుందన్నారు. బంగారుపాళ్యం పోలీసులు మే నెలలో అక్రమంగా మద్యం రవాణా చేస్తున్న వారిని పట్టుకుని 43 లక్షల రూపాయల మద్యంతో పాటు ఏడు వాహనాలను స్వాధీనం చేసుకున్నారన్నారు. అలాగే జులైలో గుడిపాల మండలంలో జరిగిన ఎటిఎం దొంగతనం కేసులో కరుడుకట్టిన అంతర్‌రాష్ట్ర నిందితుడు వసీంను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. చిత్తూరు నగర పరిధిలో ఆగస్టులో జరిగిన ఓ ఇంటి దొంగతనం కేసులో ఢిల్లీ, ఉత్తరప్రదేశ్‌కు చెందిన అంతర్‌రాష్ట్ర దొంగలను అరెస్టు చేసి వారి నుండి రూ.8.50 లక్షల బంగారు నగలు, 350 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. చిత్తూరు సంతపేటలో 20 వేల రూపాయలు ఇవ్వలేదని ఒక యువకుడిని బండరాయితో కొట్టి హత్య చేసిన ఘటనలో ముగ్గురు నిందితులను టుటౌన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు. రామకుప్పం మండలంలో ఐటి అధికారులమంటూ



తుపాకీలతో బెదిరించి నవంబర్ 11వ తేదీ రాత్రి 11.30 గంటలకు ఒక కుటుంబంను కిడ్నాప్ చేయడానికి ప్రయత్నించిన 12 మంది ముఠా సభ్యుల నుండి ఆ కుటుంబంను నైట్ బీట్ నిర్వహిస్తున్న ఇద్దరు పోలీసులు రక్షించారని ఈ కేసులో రామకుప్పం పోలీసులు ఎనిమిది మందిని అరెస్టు చేయడం జరిగిందన్నారు. ఇంటి దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు దొంగలను యాదమరి పోలీసులు శనివారం అరెస్టు చేసి వారి నుండి రూ.8.10 లక్షల విలువైన 169 గ్రాముల బంగారు నగలు 107 గ్రాముల వెండి ఆభరణాలు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. జిల్లాలో మొబైల్ ఫోన్ల పోగొట్టుకున్న వారి ఫిర్యాదు మేరకు చాట్‌బాట్ సిబ్బంది ఏడు దశల్లో రూ.4.46 కోట్ల విలువైన 2,085 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న వారికి అందించడం జరిగిందన్నారు. అలాగే జూదం ఆడుతున్న 1,224 మందిపై 201 కేసులు నమోదు చేసి వారి నుండి రూ.56 లక్షలు, 96 మొబైల్‌ఫోన్లు, 129 వాహనాలు, అలాగే కోడి పందెలు ఆడుతున్న 69 మందిని అరెస్టు చేసి 22 కేసులు నమోదు చేసి వారి నుండి 2.18 లక్షల రూపాయలు, 42 కోడిపుంజులు, 18 కోడి కత్తులు, 17 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. అలాగే ఎక్సైజ్ నేరాల కింద 1,486 కేసులు నమోదు చేసి 2,333 మందిని అరెస్టు చేసి వారి నుండి 8,598 లీటర్ల నాటుసారా, 16,237 లీటర్ల అక్రమ మద్యం, 153 లీటర్ల బీరు, 56 వేల లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు.

## ఆర్నేల్లు గడచినా ఒక్క నామినేటెడ్ పదవి రాదాయె!



శ్రీకాళహస్తి, డిసెంబర్ 29 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పార్టీ కోసం పాటు పడిన వారు. బొజ్జల కుటుంబానికి సన్నిహితంగా ఉన్న వారు నామినేటెడ్ పదవుల ఆశల పల్లకిలో విహరించారు. రోజులు గడిచే కొద్ది సొంత పార్టీలో నిరాశ నిస్ప్రహలతో పాటు కూటిమిలో లుకలుకలు చోటు చేసుకుంటున్నాయి.పేరుకే కూటమి అన్నట్లు మారింది. అయితే తెలుగుదేశం, జనసేన సఖ్యత 'మేడిపండులా మారింది' కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఏర్పాటు చేసిన ఒకే ఒక సమావేశంలో శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పరిపాలనకు సంబంధించి,సాగుతున్న ఒంటెద్దు పోకడలకు సంబంధించి జనసేన మంత్రిని నిలదీయటం గమనించదగ్గ విషయం.కూటమి ప్రభుత్వంలో పదవులు వస్తాయని ఆశించిన ఆశావహులకు నిరాశ చోటు చేసుకుంటుంది.శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ప్రధానంగా శ్రీకాళహస్తీశ్వరాలయం ధర్మకర్తల మండలిలోనే ఉంటుంది. ఇందులో కనీసం స్థానికులు పది మందికి అవకాశం ఉంటుంది. కానీ శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి నియామకానికి పాలకులు శ్రీశైలం ఇతర ఆలయాలకు లింకు పెట్టారు. దాంతో శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి పగ్గాలు ఇవ్వాల్సి ఉంది. ఓ వైపు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు తరుముకు వస్తు న్నాయి. ఇప్పటికే మహాశివరాత్రికి ముస్తాబు చేస్తున్నారు. ఎంఎల్‌ఏ వెంకటసుధీర్‌రెడ్డి పర్యవేక్షణలో శివరాత్రికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

#### స్థానిక సంస్థల్లో పాలకమండళ్ళుకూడా అంతే . . .

నామినేటెడ్ పదవులకు సంబంధించి స్థానిక శాసనసభ్యుడు పది రోజుల కిందట వారం రోజుల్లో శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి,అలాగే

### ముక్కంటి పదవులు అందని ద్రాక్షలాయే!!

అందరికి పదవులు కల్పించుటకు అనుబంధ ఆలయాల్లో కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. కానీ అమలుజరగలేదు. అనుబంధ ఆలయాల్లో కమిటీలు ఏర్పాటు చేస్తే కనీసం ఓ వంద మందిని సంతృప్తి పరచే అవకాశం ఉంది. అనుబంధ ఆలయాలకు నామినేటెడ్ పదవులకు సంబంధించి దేవాదాయశాఖ ఎసి పరిధిలోనే ఉంటుంది. ఎంఎల్‌ఏ జాబితాలు ఇస్తే అమలు జరుగుతుంది. ఇక శ్రీకాళహస్తి కోఆపరేటివ్ టౌన్‌బ్యాంకు అధ్యక్ష పదవిని మాజీ ఉపాధ్యక్షుడు మైనారిటి ముస్లింలకు కేటాయిస్తారనే ప్రచారం జరిగింది.ఈ నేపథ్యంలో టౌన్‌బ్యాంకు అధ్యక్షునికి పార్టీకి కట్టుబడి ఉన్న ఖాదర్‌బాషాకు అవకాశం వస్తుందని భావించారు. ఇక్కడ కనీసం ఓ 15 మందికి అవకాశం కల్పించవచ్చు. ఇక శ్రీకాళహస్తి వ్యసాయమార్కెట్ కమిటి నియామకం జరగా ల్సి ఉంది. ఇది జరిగితే కనీసం 15 మందికి అవకాశం కల్పించవచ్చు.మరో కీలక శాఖ శ్రీకాళహస్తి కో ఆపరేటివ్ పాలసరఫరా సంఘం ఎన్నికలు జర గాల్సి ఉంది. ఇక శ్రీకాళహస్తి ఎపిసీడ్స్ కార్పొరేషన్ పదవి ఉంది. తొట్టంబేడు వ్యవసాయమార్కెటింగ్ కమిటిలో కొంత మందికి అవకాశం కల్పించవచ్చు.

#### శివయ్య పాలకమండలే కీలకం:

శ్రీకాళహస్తీశ్వరాలయం ఏర్పాటే కీలకం. ఇందులో కూటమిలోని మూడు పార్టీలకు అవకాశం కల్పించాల్సి ఉంది. పట్టణంలో ప్రధాన సామాజిక వర్గానికి ఏం ప్రాధాన్యత ఇస్తారో వేచి చూడాలి, ఇక ధర్మకర్తల మండలిలో ఆర్యవైశ్య సమాజిక వర్గంలో ఆశావహులు అధికంగా ఉన్నారు. గతంలో ఓ సారి పాలకమండలి సభ్యుడుగా పని చేసిన వాకచర్ల గుర్రప్పశెట్టి ఉన్నారు.ఆయన మళ్ళీ తనకే అవకాశం వస్తుందని భావిస్తున్నారు.అంతేకాక శ్రీకాళహస్తిలో టోకు వ్యాపారిగా ఉన్న పొట్టి చంద్ర కోసం ఆయన తనయుడు ప్రయత్నాలు ప్రారంభించారు. వీరు కాకుండా కొందరు యువకులు జూలుగంటి మురళి పేరును ప్రతిపాదించినట్లు సమాచారం. ఇక శ్రీకాళహస్తి మున్సిపాలిటి ఉంది. మున్సిపాలిటి ఎన్నికల ప్రక్రియ కోర్టు వివాదాల్లో ఉంది.ఛైర్మెన్ పదవిని కమ్మసామాజిక వర్గానికి చెందిన పార్టీ అధ్యక్షుడు జి. విజయకుమార్ నాయుడుకు ఇస్తామని భరోసా ఇచ్చినట్లు సమాచారం.

---

**దేశంలోనే నెంబర్‌వన్‌గా కుప్పం సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్**



4లో

**చిత్తూరు పార్లమెంటు పురోభివృద్ధే ఎంపి దగ్గుమళ్ల లక్ష్యం**

4లో





**ఒక్కరోజు ముందుగానే పెన్షన్లు**

రేపు 2.60 లక్షల మంది లబ్దిదారులకు

రూ.113.49 కోట్లు పంపిణీ : కలెక్టర్ సుమిత్‌కుమార్

2లో

## విషపు గుళికలు సేవించి వివాహిత మృతి

బంగారుపాళ్యం, డిసెంబర్ 29 ప్రభాతవార్త:



జీవితంపై విరక్తి చెందిన ఓ వివాహిత విషపు గుళికలు సేవించి ఆత్మహత్యకు పాల్పడింది. తుంపాయనపల్లి పంచాయతీ పాపిశెట్టిపల్లి గ్రామంకు చెందిన రమేష్ భార్య తేజ(30) విషపు గుళికలు తిని ఆత్మహత్య చేసుకుంది. గత కొంతకాలంగా కుటుంబంలో కలహాలు చోటు చేసుకున్నాయి. దీంతో జీవితంపై విరక్తి చెందిన తేజ ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో విషపు గుళికలు సేవించింది. ఈ విషయంను గుర్తించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ మేరకు బంగారుపాళ్యం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎంఎల్ఏ సారూ..రాజీవ్‌నగర్ సమస్యలు పరిష్కరించండి

.తొట్టంబేడు, డిసెంబర్ 29 ప్రభాతవార్త



ఎంఎల్ఏ సారూ రాజీవ్‌నగర్‌లో ప్రజల సమస్యలుపరిష్కరించాలని పలువురు రాజీవ్‌నగర్ కాలనీ వాసులు పేర్కొంటున్నారు. పట్టణానికి ప్రధాన సమీపంలో ఉన్న రాజీవ్‌నగర్‌లో పలు సమస్యలు ప్రజలును వేధిస్తున్నాయి. ప్రధాన రోడ్డులేకపోవడంతో వర్షాలకు బురదమయంగా మారడంతో పాటు ఇక ఎండాకాలంలో దుమ్ముకొట్టుకుపోతోంది. ఇక కాలనీలో నిర్మించిన ఇండ్ల ముందు డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఇక పలు వీధుల్లో సిసి రోడ్లు లేవని, వర్షాకాలంలో వరదనీరంతా ఇండ్ల ముందు నుంచి వస్తుండడంతో తాము ఇబ్బందులకు గురవుతున్నామని పలువురు ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. మంచినీటి వసతి, విద్యుత్ సౌకర్యాలు లేవని, వర్షాలు పడినప్పుడు గుంతలమయమైన రోడ్డులో పడుతూ లేస్తూ ఇక్కడ జీవనం కొనసాగిస్తున్నామని గత పాలకులు తమ రాజీవ్‌నగర్‌లో సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే రాజీవ్‌నగర్‌లో ఉన్న అక్రమకట్టడాలను కూల్చివేసిన ఎంఎల్ఏ ప్రజల మన్ననలు పొందారని అయితే రాజీవ్‌నగర్ ఎదురుగా ఉన్న కొన్ని అక్రమ నిర్మాణాలు కూడా ఉన్నాయని వీటిని సమగ్రంగా సర్వేచేసినట్లయితే అక్రమాలు బయటపడుతాయని వివరించారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇండ్లకోసం రూ.500, రూ.లక్ష మున్సిపాలిటీకి డిడిలు చెల్లించామని ఇప్పటికి ఏఒక్కరికీ కూడా ఇంటిస్థలం కేటాయించలేదని దీనిపై ఎంఎల్ఏ దృష్టిసారించాలని కోరారు. వెంటనే ఈనిర్మాణాలను పూర్తిచేసి నిరుపేదలకు కేటాయించా లన్నారు. రాజీవ్‌నగర్ కాలనీపై ఎంఎల్ఏ ప్రత్యేకదృష్టిసారించి పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తే బాగుంటుం దని అభిప్రాయపడ్డారు. సమీపంలోనే హరహరతీర్థం ఉండడంతో ఇక్కడ ఎంతో మంది పర్యాటకులు వస్తుంటారని, కాగా సంక్రాంతి, మహాశివరాత్రి ఉత్సవాల్లో గిరిప్రదక్షిణ ఈమార్గంలోనే స్వామిఅమ్మవార్లు వెళ్తుంటారని, టిడ్కో అపార్టుమెంట్లు నుంచి గిరిప్రదక్షిణ మార్గానికి అప్రోచ్‌రోడ్డు నిర్మించడం మంచిదే కానీ రాజీవ్‌నగర్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డిని కాలనీ వాసులు కోరుతున్నారు.

## వరిపైరుకు యూరియా ఎక్కువ మోతాదులో వాడొద్దు

-ఏఓ సురేంద్రరెడ్డి

తొట్టంబేడు, డిసెంబర్ 29 ప్రభాతవార్త



అన్నదాతలు యూరియా ఎక్కువ మోతాదులో వాడొద్దని దీని వల్ల వరిపైరుకు తెగుళ్ళు సోకుతాయని వ్యవసాయాధికారి సురేంద్రరెడ్డి తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో 10వేల హెక్టార్లలో వరిపైరు వేశారని, 2,200హెకార్ట వరకు ఈ క్రాప్ నమోదు చేశామన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు 722 ఎకరాలు పంట నష్టం వాటిల్లినట్లు నివేదికలను ప్రభుత్వానికి పంపామని, 80శాతం విత్తనాలు సబ్సిడీలో ఇస్తామన్నా అన్నదాతలు ఎవ్వరుముందుకు రావడం లేదని తెలిపారు. వరిపైరుకు ఎక్కువగా పూడి, ఇలగనూరు, కొణతనేరి గ్రామాల్లో పర్యటించి అన్నదాతలకు పలుసూచనలు, సలహాలు ఇచ్చానన్నారు. యూరియా ఎక్కువ మోతాదులో వేస్తే తెగుళ్ళు వస్తాయని ప్రస్తుతం వరిపైరుకు గొట్టాలపురుగు ఆశించి ఉన్నాయని దీని నివారణకు పొలంలో నీరు తీసివేసి ఎకరాకు 10కిలోలు కార్బోఫ్యూరాన్ మందు పిచికారి చేయాలన్నారు. అంతేకాకుండా కార్బోసల్ఫాన్ ఎకరాకు 400 గ్రాములు నీటిలో కలసి పిచికారి చేయాలన్నారు. జింకు నివారణకు చలామిన్ ఎకరాకు 250 గ్రాములు నీటిలో కలసి వరిపైరుకు స్ప్రేచేయాలన్నారు.

***పంటల బీమా పథకం సద్వినియోగం చేసుకోండి..***

అన్నదాతలు ప్రధనమంత్రి ఫసల్ బీమా యోజన(పిఎంఎఫ్‌బివై) పథకాన్ని రబీ సీజన్ 2024-25 సంవత్సరంలో సద్వినియోగం చేసుకోవాలని ఏఓ సురేంద్రరెడ్డి తెలిపారు. పంటల బీమా పథకపు ముఖ్య ఉద్దేశ్యం తుఫానులు, కరువు, అకాల వర్షాలు వంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట దిగుబడి నష్టపోయిన రైతులకు ఆర్థిక సాయం అందించడం, వాతావరణ అంశాల ఆధారంగా సంభవించిన పంట నష్టాన్ని అంచనా వేసి బీమా పరిహారం చెల్లించడం ఎంపిక చేసిన పంటలను సాగు చేస్తూ నిర్ణీత సమయంలో ప్రీమియం చెల్లించి నమోదు చేసుకున్న కౌలు రైతులతో సహా రైతులందరు ఈ బీమా పథకంలో చేరడానికి అర్హులన్నారు. బీమా మొత్తానికి 1.5శాతం, వాణిజ్య ఉద్యానవన పంటలకు 5శాతం, వాస్తవంగా నోటిఫై చేసిన ప్రీమియం శాతం ఇంకా తగ్గిన సందర్భంలో మొత్తం చెల్లిస్తే సరిపోతుందన్నారు. వరిపైరుకు బీమాకు రూ.630లు, వేరుశనగ పంటకు రూ.450లు మీసేవా కేంద్రాల్లో చెల్లించి రసీదు పొంది బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ఇరుకు వీధులు: నిబంధనలు గాలికి . . .

శ్రీకాళహస్తి,డిసెంబర్ 29 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పట్టణంలో రాజుల కాలం నాటి రహదారులు. ఇరుకు రోడ్లుపై నిత్యం ట్రాఫిక్ సమస్యతో జనం సతమత మౌతున్నారు. పోలీసులు ఉన్న సిబ్బందితోనే నిర్వహిస్తున్నారు. అయితే జనంలో చైతన్యం రానంత కాలం పరిస్థితి ఇలాగే ఉంటుందని చెబుతున్నారు. శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో తప్పని సరిగా 'ట్రాఫిక్ పోలీసు స్టేషన్' అవసరం. అయితే ఉన్నతాధికారులు ఇక్కడ వచ్చినపుడు అరచేతిలో స్వర్గం చూపుతారు. తరువాత పట్టించుకోరు.దాంతో నిత్యం పెరుగుతున్న వాహనాలతో గందరగోళంగా మారుతుంది. ముఖ్యంగా సన్నిధివీధి, జయరామారావు వీధి,పెద్దమసీదు వీధిలో ప్రయాణం నరకంగా మారింది.ఈ వీధుల్లో హోటళ్లు,వ్యాపార సంస్థలు, సైకిల్‌షాపులు, గోదాములు,పండ్ల వ్యాపారాలు ఇలా రక రకాలుగా ఉంటున్నాయి. ముఖ్యంగా పెద్ద మసీదు వీధిలో పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. అసలే ఇరుకు వీధులు.దానికి తోడు హోటళ్ళ ముందు పార్కింగ్ స్థలం లేదు. వచ్చిన వారు తమ వాహనాలను రోడ్ల మీదనే పార్కింగ్ చేస్తున్నారు.

***పోలీసులు ఇక్కడ ప్రత్యేక దృష్టి పెట్టాలి:*** శ్రీకాళహస్తి పోలీసులు రెండు వీధుల్లో ప్రత్యేక దృష్టి సారించాలి.ముఖ్యంగా జయరామారావు వీధి ఇరుకుగా ఉంటుంది. ఈ వీధిలో స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా,ఎల్ఐసి ఇండియా ఏజెన్సిలు, వ్యాపార సంస్థలు పాల డిపోలు,సినిమాథియేటర్లు, లాడ్జిలు, హోటళ్ళు ఉన్నాయి. ఇక్కడవన్‌వే ఉంది. అయితే బేరివారి మండపం నుంచి ఎదురుగా వాహనాలను ప్రవేశించకుండా పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదు.కానీ పడమరగా వెళ్ళే వాహనాలకు ఎదురుగా ఆటోలు ప్రవేశించటంతో పరిస్థితి ఆగమ్యగోచరంగా మారుతుంది. కొందరు స్థానికుల కార్లు కూడా అవరోధంగా మారుతంది. ప్రస్తుతం కొత్తగా వైన్‌షాపు. ఇక సన్నిధివీధిలో అసలే ఆలయానికి వచ్చే వాహనాలతో రద్దీగా ఉంటుంది. దీనికి తోడు ఇటీవల కాలంలో ఆర్‌టిసి బస్సులు తిరుపతి వెళ్లటానికి ఈ మార్గంలో వెళుతున్నాయి. అయితే జలవినాయక ఆలయం వద్ద ఆర్‌టిసి బస్సులు తిరగలేక తిప్పలు పడుతూ ట్రాఫిక్‌కు అంతరా యం కల్గిస్తున్నారు.ఈ సమస్యలు పోలీసులకు తెలియనివి కాదు.కానీ ఎందుకో దృష్టి సారించలేకపోతున్నారు. స్థానిక సిఐ, డివైయస్‌పికు మంచి అవగాహన ఉంది.వారు బేరివారి మండపం వద్ద నుంచి తూర్పుగా ఆటోలు,కార్లును అనుమతించక కట్టడి చేస్తే ఆ వీధిలో ట్రాఫిక్ సమస్య ఉండదు. అలాగే పెద్దమసీదు వీధిలో ప్రత్యేక పెట్రోలింగ్ ఏర్పాటు చేయాల్సి ఉంది.కాగా బిక్షాల గాలిగోపురం నుంచి తిరుపతి వైపు వెళ్ళే ఆర్‌టిసి బస్సులు జలవినాయక ఆలయం వైపు వెళ్ళకుండా తేరువీధి నుంచి వెళ్ళితే సమస్య ఉండదు. ఈ అంశాలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమౌతుంది.

## ఒక్క రోజు ముందుగానే పెన్షన్లు

– రేపు 2.60 లక్షల మంది లబ్ధిదారులకు రూ.113.49 కోట్లు పంపిణీ

– కలెక్టర్ సుమిత్‌కుమార్



చిత్తూరు, డిసెంబర్ 29 ప్రభాతవార్త:

నూతన సంవత్సరం ప్రారంభానికి ఒక్క రోజు ముందే మంగళవారం జనవరి నెలకు సంబంధించి సామాజిక పెన్షన్లను ప్రభుత్వం పంపిణీ చేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. జనవరి నెలకు సంబంధించిన సామాజిక పెన్షన్లను మంగళవారం తెల్లవారుజాము 6 గంటల నుండి పంపిణీ చేసి పూర్తి చేయడం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. జిల్లాలో జనవరి నెలకు సంబంధించి 2,67,240 మంది పెన్షన్‌దారులకు 113.49 కోట్ల రూపాయలు పంపిణీ చేయాల్సి వుండగా మంగళవారం సాయంత్రానికి వంద శాతం పెన్షన్ల పంపిణీ పూర్తి చేయాలని అందుకు అనుగుణంగా అధికారులు ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. అలాగే గత రెండు నెలల్లో వివిధ కారణాలతో పెన్షన్ తీసుకోని వారికి ఈ నెలలో 3 నెలల మొత్తం పెన్షన్ ఇవ్వాలన్నారు. అలాగే నవంబర్ 2024 నెలలో జీవిత భాగస్వామి మృతి చెందిన 236 మందికి ఈ నెలలో కొత్తగా పెన్షన్ మంజూరు అయ్యిందన్నారు. మంగళవారం ఏ కారణంతో అయిన పెన్షన్ తీసుకోని లబ్దిదారులకు జనవరి 2వ తేదీ వారి ఇంటి వద్దకే వచ్చి పెన్షన్లు అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంను ఎంపిడిఓలు, మున్సిపల్ కమీషన్లు పకడ్బందీగా చేపట్టి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

చిత్తూరు, డిసెంబర్ 29 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో ఉదయం 10 గంటల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగనుంది. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరు తప్పక హాజరు కావాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాల్లో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి సంబంధిత అధికారులు తప్పక హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

## యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు విజయవంతంకు పిలుపు

చిత్తూరు, డిసెంబర్ 29 ప్రభాతవార్త:



కాకినాడలో జనవరి 5 నుండి 8వ తేదీ వరకు నిర్వహించే యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను విజయవంతం చేయాలని యుటిఎఫ్ సీనియర్ నాయకుడు సురేష్ పిలుపునిచ్చారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు విజయవంతం కోసం ఆదివారం బంగారుపాళ్యం, పుంగనూరు, పలమనేరు, చిత్తూరుల్లో యుటిఎఫ్ కార్యకర్తలు ప్రచార జాత కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రచార జాత చిత్తూరు యుటిఎఫ్ కార్యాలయంకు మధ్యాహ్నం 3 గంటలకు చేరుకోవడంతో సీనియర్ నాయకుడు సురేష్ కార్యాలయ ఆవరణలో పతాకంను ఆవిష్కరించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ యుటిఎఫ్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంలో జరుపుకుంటున్న స్వర్ణోత్సవ మహాసభల్లో పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కాకినాడలో జరుగనున్న యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలకు సిఎం నారా చంద్రబాబునాయుడు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లు హాజరు కానున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యుటిఎఫ్ కార్యదర్శి జివి రమణ, జిల్లా యుటిఎఫ్ నాయకులు సోమశేఖర్, మణిగండన్, సుధాకర్‌రెడ్డి, ఎస్.రెహెనాబేగం తదితరులు హాజరయ్యారు.

## భూసమస్యలు పరిష్కరించడమే రెవెన్యూ సదస్సుల లక్ష్యం

పూతలపట్టు, డిసెంబర్ 29 ప్రభాతవార్త:



క్షేత్ర స్థాయిలో రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న భూసమస్యలను పరిష్కరించం కోసమే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని, వీటిని రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకుని సమస్యలను పరిష్కరించుకోవాలని తహసిల్దారు గుర్రప్ప పేర్కొన్నారు. వేపనపల్లి గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సుకు హాజరైన తహసిల్దారు గుర్రప్ప మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో భూములకు సంబంధించి ఎదైనా సమస్యలు వుంటే తమ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని ప్రజలను కోరారు. జిల్లా తెలుగుదేశం కార్యదర్శి హేమాద్రి మాట్లాడుతూ ప్రభుత్వం రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ప్రతిష్టాత్మకంగా రెవెన్యూ సదస్సులను నిర్వహించడం జరుగుతున్నదన్నారు. రైతులు ఆన్‌లైన్‌లో తమ పేర్లు మారి వున్నా,, ఒక సర్వే నెంబర్‌పై మరొకరు పాస్ బుక్ చేయించుకుని వున్నా ఈ సదస్సులో అధికారుల దృష్టికి తీసుకువస్తే వాటిని పరిశీలించి పరిష్కరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వసంతమ్మ, పంచాయతీ సెక్రటరీ, సర్వేయర్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీల ముసుగులో బెదిరింపులు

– అక్రమాలను నిలదీసినందుకు ఇంటిపై దౌర్జన్యం

పాలసముద్రం, డిసెంబర్ 29 ప్రభాతవార్త:

పాలసముద్రం మండలంలో ఎస్సీల ముసుగులో కొంతమంది వ్యక్తులు నిజాయితీగా అక్రమాలను వెలికితీస్తున్న వ్యక్తిపై దౌర్జన్యానికి పాల్పడటంతో నిజమైన ఎస్సీలకు ఈ సంఘటన కలచివేస్తోంది. ఎస్సీలను సంరక్షించడానిరి రాజ్యాంగం వున్నప్పటికీ కొంతమంది ఎస్సీలు ఈ అంశంను దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు మిన్నంటుతున్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజుల్లోనే పాలసముద్రం మండలం నుండి ఇసుక అక్రమంగా తమిళనాడుకు జోరుగా తరలివెళ్ళిపోయింది. ప్రభుత్వం నిరుపేదల కోసం ఉచిత విధానంను అమలు చేస్తే ఇది పాలసముద్రం మండలంలోని కొంతమంది నాయకులకు కాసుల వర్షం కురిపించింది. ఈ విషయంపై ఎవరైనా నిలదీస్తే తమ ప్రభుత్వం తమకు ఇష్టమొచ్చినట్లు చేస్తాం అన్న తరహాలో వ్యవహరించడంతో అధికారులు సైతం ఈ విషయంను చూసి చూడనట్లు వుండిపోయారు. అయితే ఈ విషయంపై స్పందించిన వనదుర్గాపురం గ్రామంలోని ఓ వ్యక్తి ఇసుక అక్రమ రవాణాపై యుద్దం ప్రారంభించాడు. అధికారులకు ఫిర్యాదు చేయడం, ఎక్కడైనా ఇసుక అక్రమ రవాణా జరిగితే అధికారులకు పక్కాగా సమాచారం అందించడం చేయడంతో ప్రస్తుతం మండలంలో ఇసుక అక్రమ రవాణా తగ్గుముఖం పట్టింది. అక్రమార్జనకు అలవాటు పడ్డ కొంతమంది అధికార పార్టీకి చెందిన నాయకులు ఎలాగైనా తమ అక్రమాలపై సమాచారం ఇస్తున్న వ్యక్తితో అణచివేయాలని నిర్ణయించి అతనిపై తాము రంగంలోకి దిగకుండా ఇతరులను ఊసి గొల్పారు. ఈ మేరకు అతని వారు అతని ఇంటికి చేరుకుని దౌర్జన్యానికి పాల్పడుతుంటే స్థానికులు కొంతమంది జోక్యం చేసుకుని అతనేం చేశాడని నిలదీసి వారిని అక్కడి నుండి పంపించివేశారు. ఈ క్రమంలో అక్రమార్కులను ఎదుర్కొంటున్న వ్యక్తితో దౌర్జన్యం చేయడానికి వచ్చిన వ్యక్తులు మాట్లాడుతూ అక్రమాలు వెలికి తీయడం నిలిపివేయకుంటే అట్రాసిటీ కేసు పెట్టడానికైనా వెనుకాడేది లేదని హెచ్చరించి మరీ వెళ్ళారు. ఈ పరిస్థితుల్లో మండలంలో జరుగుతున్న విషయాలను అటు అధికార పార్టీకి చెందిన పై స్థాయి నాయకులు, ఇటు నియోజకవర్గ, జిల్లా స్థాయి అధికారులు దృష్టి సారించి సమస్య మరింత జఠిలం కాకుండా చూడాల్సిన బాధ్యత వుంది.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## బోయకొండపై పెరిగిన భక్తుల రద్దీ

బోయకొండ(చౌడేపల్లి), డిసెంబర్ 29 ప్రభాతవార్త



శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో నిండింది. ఆదివారం కొండ దినం కావడంతో రాష్ట్రం నుంచి కాకుండా కర్ణాటక, తమిళనాడు తదితర ప్రాంతాల వారు తరలిరావడంతో యాత్రీకుల రద్దీ అధికమైంది. ఉదయాన్నే వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేషాభిషేకం అలంకరణ గావించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారి క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరం ఆలయ అర్చక, అధికార, సిబ్బంది భక్తులకు సేవలందించారు.

## ఆగివున్న స్కూటర్‌ను ఢీకొన్న ఆర్టీసీ : యువకుడికి గాయాలు

చౌడేపల్లి, డిసెంబర్ 29 ప్రభాతవార్త



ఆగివున్న స్కూటర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొనగా యువకుడికి గాయాలైన సంఘటన ఆదివారం చౌడేపల్లిలో చోటు చేసుకొంది. చౌడేపల్లి-పుంగనూరు ప్రధాన రహదారిలోని పట్టణంలోని పెట్రోల్ బంక్ వద్ద ఆగివున్న స్కూటర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొన్నది. ఈప్రమాదంలో స్కూటరిస్టు పెద్దయల్లకుంట్లకు చెందిన సునీల్(26)కు కాలు విరిగింది. గుర్తించిన చుట్టుపక్కల వారు 108సేవల ద్వారా మదనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## కాణిపాకంలో 150 మంది ఉచిత వైద్యపరీక్షలు

కాణిపాకం, డిసెంబర్ 29 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానం ఆస్థాన మండపంలో ఆదివారం చిత్తూరు శ్రీవెంకటేశ్వర ఆయుర్వేద మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం ద్వారా 150 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక ఆస్థాన మండపంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఈసందర్భంగా కాణిపాకం పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు, భక్తులు, సిబ్బందికి వివిధ రకాల జబ్బులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓ ఎస్వీ.కృష్ణారెడ్డి, సూపరెండెంట్ వాసు, మెడికల్ కళాశాల వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హైందవ శంఖారావం జన జాగరణ విజయవంతం చేయండి

వెదురుకుప్పం, డిసెంబర్ 29 ప్రభాతవార్త :



హైందవ శంఖారావం జన జాగరణ కార్యక్రమం విజయవంతం చేయాలని ప్రచార కార్యక్రమం నిర్వహించి, గోడపత్రికలు, స్టిక్కర్స్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్వేటినగరం కండ కన్వీనర్ రోశయ్య మాట్లాడుతూ జనవరి 5న ఎస్ఎల్‌వి లైలా గ్రీస్ మెడోస్, కేసరపల్లె, విజయవాడలో జరుగు హైందవ శంఖారావం కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆదివారం వారు గోడపత్రికలు, స్టిక్కర్స్‌లు పంపిణీ చేశారు.హిందువులందరు హైందవ సంస్కృతిక, సాంప్రదాయాలను కాపాడుకోవడంకు ముందుకు రావలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్వేటినగరం ఖండ సహ కన్వీనర్ రోహిత్‌రాజు, ఖండ సహకార్య వాహ మనోహర్ రెడ్డి, చిత్తూరు జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పాముల శేషాద్రి కుమార్, మండల భారతీయ జనత పార్టీ మాజీ అధ్యక్షులు విశ్వనాథ రెడ్డి, నాయకులు అశోక్, తాతి రెడ్డి రామకృష్ణా రెడ్డి,బాలాజీ రెడ్డి, లోకనాథ రెడ్డి పాల్గొన్నారు.

## అటవీ అధికారులచే ఎనిమిది అక్రమ కలప ట్రాక్టర్లు సీజ్

కుప్పం, డిసెంబర్ 29 ప్రభాతవార్త



ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా కలపను కర్ణాటక రాష్ట్రాన్ని తరలిస్తున్న ఎనిమిది ట్రాక్టర్లను అటవీ అధికారులు సీజ్ చేశారు. కుప్పం రేంజర్ జయశంకర్ నేతృత్వంలో డిఆర్వో పుల్లయ్య, సుధాకర్, మధు, నరేంద్ర, హరిబాబు, పవన్ తదితరులు ఐదు బృందాలుగా విడిపోయి గుడుపల్లె మండలం పొగురుపల్లి, శాంతిపురం సరిహద్దు కెంపాపురం, రామకుప్పం మండలం విజలాపురం వద్ద కాపు కాశారు. వివిధ మార్గాల ద్వారా కలప వ్యాపారులు నీలగిరి, తంగేడు, కానుగ, వేప తదితర వృక్షాలను నేలకూల్చి ట్రాక్టర్లల్లో అక్రమంగా తరలిస్తుండగా అటవీ అధికారులు దాడులు చేసి కలప ట్రాక్టర్లను సీజ్ చేసి కుప్పం ఫారెస్ట్ కార్యాలయంకు తరలించారు. ఈ మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఫ్ఆర్వో జయశంకర్ తెలిపారు.

## తెదేపా సభ్యత్వం పొందే కార్యకర్తలకు పార్టీ అండ

కుప్పం, డిసెంబర్ 29 ప్రభాతవార్త



తెలుగుదేశం పార్టీ సభ్యత్వం పొందే కార్యకర్తలకు సిఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ అండగా నిలుస్తారని కుప్పం టిడిపి విస్తరణ కమిటీ సభ్యుడు కె.కన్నన్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక 176వ బూత్, 13వ వార్డులో తెదేపా సభ్యత్వ నమో దు కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వందరూపాయల సభ్యత్వం పొందేవా రికి ఐదు లక్షల ప్రమాద భీమా సౌకర్యం పార్టీ కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు లోకేష్, ప్రధాన కార్యదర్శి భరత్, బూత్ కన్వీనర్ మణి, నేతలు మునస్వామి తదితరులు పాల్గొన్నారు

## మాజీ ఎమ్మెల్సీ గౌనివారి కుటుంబీకులచే అన్నదానం

శాంతిపురం, డిసెంబర్ 29 ప్రభాతవార్త



మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు కుటు ంబీకులు వారి తండ్రి దివంగత గౌనివారి నారాయణప్ప జ్ఞాప కార్థం ఆదివారం స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లోని అన్న క్యా ంటీన్ ద్వారా పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ఇళ్లలో ఏదేని శుభకార్యాలు, విశేషాలు ఉంటే దాతలు ముందుకు వచ్చి అన్న క్యాంటీన్ ద్వారా అన్నదానం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## మృతురాలి కుటుంబానికి పరామర్శ

శ్రీకాళహస్తిరూరల్, డిసెంబర్ 29 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలంలోని కమ్మకొత్తూరు గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో స్వర్గస్తులైన టిడిపి కార్యకర్త సతీమణి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి కుటుంబసభ్యులను ఓదార్చారు. తెలుగుదేశంపార్టీ కుటుంబానికి అండగా ఉంటుందని ఎంఎల్ఏ బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి మాతృమూర్తి బొజ్జలబృందమ్మ, పలువురు తెలుగుదేశంపార్టీ నాయకులు పాల్గొన్నారు.

## కిడ్నీ వ్యాధితో వృద్ధురాలు మృతి



బంగారుపాళ్యం, డిసెంబర్ 29 ప్రభాతవార్త:

మండలంలోని ముంగరమడుగు గ్రామంకు చెందిన మునెమ్మ కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఆదివారం మృతి చెందింది. ఈమె గత కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతుండేది. ఆదివారం తీవ్ర అస్వస్థతకు లోనైన మునెమ్మ మృతి చెందింది. ఈమె తెలుగుదేశం కార్యకర్తగా వున్నారు. ఈమె మృతి పట్ల తెలుగుదేశం నాయకులు సంతాపం తెలిపారు.

## అన్నదాతల మోటార్లు, స్టార్టర్లు చోరీని అరికట్టండి



తొట్టంబేడు, డిసెంబర్ 29 ప్రభాతవార్త

అన్నదాతల మోటార్లు, స్టార్టర్లు చోరీని అరికట్టాలని మండల పార్టీ అధ్యక్షుడు గాలిమురళీనాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని గురుకుల పాళెం, కొమ్మనగుంట, గాబచేను, చిన్నకన్నలి తదితర గ్రామాల్లో శనివారం రాత్రి స్టార్టర్ బాక్సులు పగులగొట్టి చోరీ చేయడం, రైతులు వర్షం కారణంగా రాత్రివేళల్లో మంచు ప్రభావంతో పొలాల్లోకి వెళ్ళిచూడగా స్టార్టర్లు లేకపోవడంతో రైతులు ఆవేదనకు గురై సుమారు 40మంది రైతులు సమస్యలను మురళీనాయుడుకు విన్నవించారు. అంతేకాకుండా కాసరం నుంచి తెలుగుగంగ కాలువపైన మోటార్లు స్టార్టర్లుకు కూడా రక్షణ కల్పించాలని తొట్టంబేడు మరియు టుటౌన్ పోలీసు అధికారులు విచారణ జరిపి చోరీ చేసిన వారిని గుర్తించిన రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## నేడు పోలీస్ గ్రీవెన్స్ రద్దు

చిత్తూరు, డిసెంబర్ 29 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ఎస్పీ మణికంత చందోలు ప్రతి సోమవారం జిల్లా పాత పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ఈ వారం రద్దు చేశారు. జిల్లా పోలీసు శిక్షణా మైదానంలో పోలీసు కానిస్టేబుళ్ళ భర్తీ సెలక్షన్స్ ప్రక్రియ నిర్వహిస్తుండటంతో పోలీసు గ్రీవెన్స్‌ను ఈ వారం ఎస్పీ రద్దు చేశారు. ప్రజలు ఎవ్వరు సమస్యలు తీసుకుని ఎస్పీ మణికంత చందోలును కలవడానికి సోమవారం చిత్తూరుకు రావద్దు.

## ఘనంగా కృష్ణతేజ డెంటల్ కళాశాల కాన్వికేషన్

తిరుపతి విద్య డిసెంబర్ 29 ప్రభాత వార్త



తిరుపతి కచ్చపి ఆడిటోరియంలో కృషతేజ డెంటల్ కళాశాల కాన్వికేషన్ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చదలవాడ విద్యాసంస్థల అధినేత డాక్టర్ చదలవాడ కృష్ణమూర్తి ముఖ్యఅతిథిగా విచ్చేసి బీడీఎస్ డిగ్రీ పూర్తి చేసిన 80 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలు ప్రధానం చేశారు.కళాశాల క్రమశిక్షణతో పాటు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు.దేశం గర్వించేలా విద్యార్థులు రాణించి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు ప్రతిష్టలు తీసుకురావాలని పిలుపునిచ్చారు.బీడీఎస్ పూర్తి చేసిన విద్యార్థులు సేవే లక్ష్యంగా పనిచేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కడప ప్రభుత్వ దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్,ఓరల్ పథాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎం జ్యోత్స్న, కృషతేజ చారిటీస్ మేనేజింగ్ ట్రస్టీస్ చదలవాడ సుమలత, చదలవాడ కవిత,ఏ ఓ శ్రీనివాసులు,సభ్యులు వరుణ్ సాయి, పద్మసాహితీ,డెంటల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్,వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్,పూర్వపు ప్రిన్సిపాల్ డాక్టర్ రవీంద్రనాథరెడ్డి, కృష్ణ,వివిధ శాఖల విభాగాల అధిపతులు,విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అల్పపీడనంతో చెరువులకు నష్టం: ఎస్ఇ మదనగోపాల్

శ్రీకాళహస్తి,డిసెంబర్ 29 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లో ఫెంగల్ తుఫాను, అల్పపీడనంతో చెరువులకు నష్టం కల్గిందని ఇరిగేషన్ ఎస్ఇ మదనగోపాల్ ఆదివారం తెలిపారు. శ్రీకాళహస్తి డివిజన్‌లో 64 చెరువులు దెబ్బతిన్నాయి. ఈనేపథ్యంలో శ్రీకాళహస్తి మండలంలోని 42 చెరువులు దెబ్బతిన్నాయని వాటిని తాత్కాలిక మరమ్మత్తులకు రూ.77.60లతో చేపట్టామన్నారు. కాగా ఏర్పేడుమండలంలోని 8 చెరువులు దెబ్బతినగా రూ.16.60లక్షలతో తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టామన్నారు. రేణిగుంట మండలంలో 6 చెరువులు దెబ్బతినగా రూ.15లక్షలతో మరమ్మత్తులు చేపట్టి నీటిని కాపాడామన్నారు. తొట్టంబేడు మండలంలో 8 చెరువులు దెబ్బతినగా రూ.26.50లక్షలతో నీటిని కాపాడామన్నారు. కాగా సత్యవేడు డివిజన్‌లోని సత్యవేడులో 9 చెరువులు దెబ్బతినగా రూ.29.20లక్షలతో మరమ్మత్తులు చేసినట్లు ఎస్ఇ మదనగోపాల్ తెలిపారు. వరదయ్యపాళెం మండలంలో 19 చెరువులు దెబ్బతినగా రూ.44.10లక్షలతో మరమ్మత్తులు చేపట్టి నీటిని కాపాడినట్లు వివరించారు. బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో 7 చెరువులు దెబ్బతినగా రూ.15.60లక్షలతో చేపట్టామన్నారు. కాగా కెవిబిపురం మండలంలో భారీ నష్టం వాటిల్లినట్లు ఎస్ఇ వివరించారు. ఈ మండలంలో 33 చెరువులు దెబ్బతిన్నాయన్నారు. రూ.42.35ల క్షలతో తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టినట్లు వివరించారు. నాగలాపురంలో రెండు చెరువులను రూ.6.3లక్షలతో నారాయణ వనంలో 1 చెరువు దెబ్బతినగా రూ.2లక్షలు పిచ్చాటూరులో 13 చెరువులు దెబ్బతినగా రూ.18.35లక్షలు తో మరమ్మతులు చేపట్టినట్లు వివరించారు. తాత్కాలిక మరమ్మతులు చేపట్టి పంటను కాపాడటానికి చర్యలు తీసుకున్నా మన్నారు.

## జాతీయ శిక్షకునిగా హర్షవర్ధన్ రెడ్డి

తిరుపతి క్రీడ, డిసెంబర్ 29, ప్రభాతవార్త:



తిరుపతికి చెందిన ఎన్ బి హర్షవర్ధన్ రెడ్డి జాతీయ శిక్షకునిగా అర్హత సాధించారు. హైదరాబాదులో జరుగుతున్న జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ జాతీయ సదస్సులో ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు సి ఆర్ రాకేష్ శర్మ ఆదివారం ధృవీకరణ పత్రం అందించారు. జెసిఐ జాతీయ ఉపాధ్యక్షుడుగా ఉన్న హర్షవర్ధన్ ట్రైనింగ్ ఫర్ ట్రైనర్స్ కోర్సులో ప్రతిభ చూపడం వల్ల ఈ గౌరవం దక్కింది. ఐఐఎం అహ్మద బాద్ పూర్వ విద్యార్థి అయిన ఆయన జెసిఐ తిరుపతి చాప్టర్ అధ్యక్షుడు స్థాయి నుంచి అంచెలంచెలుగా జాతీయ స్థాయికి ఎదిగారు. దీని పట్ల తిరుపతికి చెందిన పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## కోలాహలంగా ముగిసిన రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలు

తిరుపతి క్రీడ, డిసెంబర్ 29, ప్రభాతవార్త



తిరుపతిలోని శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ నందు ఈనెల 28, 29 తేదీలలో ఆంధ్రప్రదేశ్ స్పీడ్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి స్టేట్ పోటీలు ఘనంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. క్రీడా సముదాయం కోలాహలంగా మారింది. అండర్ నాలుగు విభాగాల నుంచి అబోవ్ 16 విభాగాల వరకు బాల బాలికలకు వేరువేరుగా స్కేటింగ్ క్రీడలను నిర్వహించారు. పథకాలు పొంది విజేతగా నిలిచిన క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎంపిక కాబడ్డారు. జనవరి 2025 సంవత్సరంలో మధురైలో జరుగు జాతీయ స్థాయి క్రీడా పోటీలకు సుమారు 50 మందికి క్రీడాకారుల దాకా ఎంపిక కాబడ్డారు. క్రీడాకారులకు ఆంధ్రప్రదేశ్ స్పీడ్ స్కేటింగ్ అసోసియేషన్ తరఫున ఉచిత భోజన వసతి కల్పించారు. ఆంధ్రప్రదేశ్ స్పీడ్ స్కేటింగ్ అసోసియేషన్ వారు పథకాలను మరింత ఆకర్షణీయంగా తయారు చేశారు అందులో రాణి రుద్రమదేవి ప్రతిమను ముద్రించి క్రీడాకారుల్లో నూతన ఉత్సాహాన్ని నింపారు. విజేతగా నిలిచిన ప్రతి క్రీడాకారులు పథకాలు చూసి మరింతగా మురిసిపోయారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఐ సి డి ఎస్ సిడిపిఓ పద్మజ, శ్రీనివాస్, ఎస్ ఎస్ ఎఫ్ ఎఫ్ ఐ జనరల్ సెక్రటరీ మురగానంద, సౌత్ జోన్ సెక్రెటరీ జి ప్రతాప్, ఏపీ ఎస్ ఎస్ ఏ వైస్ ప్రెసిడెంట్ రమణ మహేష్ ఏపీ ఎస్ ఎస్ ఏ జాయింట్ సెక్రెటరీ సంతోష్ కుమార్ కర్ణాటక సెక్రెటరీ మణికంత ఎస్ ఎస్ ఐ టెక్నికల్ హెడ్ గౌతమ్ మరియు పద్మజ పాల్గొన్నారు క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుణ్యానికి దోహదపడతాయని కోచ్‌లు తెలిపారు. క్రీడాకారులు వారి తల్లిదండ్రులు కోర్టులతో కిరాణా సముదాయం జనసంతోహంగా మారింది.

## జిల్లా బాడ్మింటన్ మాస్టర్స్ సెలెక్షన్స్

తిరుపతి క్రీడ, డిసెంబర్ 29, ప్రభాతవార్త



ఉమ్మడి చిత్తూరు జిల్లా బాడ్మింటన్ మాస్టర్స్ సెలెక్షన్స్ ఆదివారం ప్లే పిట్ బ్యాడ్మింటన్ అకాడమీలో నిర్వహించారు. చిత్తూరు జిల్లా నలుమూలల నుండి వచ్చిన మాస్టర్ బ్యాడ్మింటన్ ప్లేయర్స్ మధ్య పోటీలు అన్ని కాటగిరిలో నిర్వహించారు. పోటీలలో చిత్తూరు జిల్లా తరపున సెలెక్ట్ అయిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ మీట్‌లో ఎండి 35 షఫీ, దేవేంద్ర, ఎంఎస్ 40 షరీఫ్, నారాయణ డికె, ఎండి 40 ప్రకాష్, శీన, ఎంఎస్ 45 కెవి కన్నన్, టి. రాజశేఖర్, ఎండి 45 జి. శివయ్య, ఎస్ ముస్తక్, ఎంఎస్ 50 ప్రభాకర్ రెడ్డి, ఎంఎస్ 55 కె. శంకర్ రెడ్డి, వెంకటరత్నం, ఎండి 55 కె. సుబ్రమణ్యం, కె. అమర్నాధ రెడ్డి, ఎంఎస్ 65 ఆర్. రాజగోపాల్ రెడ్డి, ఎస్. సుధాకర్ రావ్, ఎండి 65 ఎస్ సుధాకర్ రావ్, పి. మునస్వామిలు ఎన్నికైయ్యారు.

## ప్రొఫెసర్‌పై చర్యలకు అధికారులు సన్నద్ధం

తిరుపతి విద్య డిసెంబర్ 29, ప్రభాతవార్త :

ఎస్వీ అగ్రికల్చరల్ కళాశాలలో విద్యార్థిని పట్ల అసభ్యంగా వ్యవహరించి అరెస్టైన ప్రొఫెసర్ ఉమామహేష్ పై చర్యలు తీసుకునేందుకు వర్సిటీ అధికారులు సిద్ధమయ్యారు. ఈ మేరకు ఆయన ప్రవర్తనపైన, విద్యార్థితో ప్రవర్తించిన తీరు, అరెస్ట్ కాబడిన ఉదంతంపై కళాశాల అధికారులు గుంటూరు ఎన్జీరంగా వర్సిటీ అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో (నేడు) సోమవారం ప్రొఫెసర్ ను సస్పెండ్ చేసేందుకు రంగం చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

## నేడు అమావాస్య : గ్రామోత్సవం

శ్రీకాళహస్తి,డిసెంబర్ 29 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం అమావాస్య సందర్భంగా స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహిస్తామని ఆలయ ఇఓ టి.బాపిరెడ్డి ఆదివారం తెలిపారు. సాధారణంగా అమావాస్య సందర్భంగా గ్రామోత్సవం, పౌర్ణమి రోజు ఊంజల్ సేవలను ప్రత్యేకంగా ఉంటుంది. మార్గశిర అమావాస్య సందర్భంగా సోమవారం ఉదయం 7గంటలకు స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహించబడుతుందన్నారు. 8గంటలకు గొబ్బెమ్మ గ్రామోత్సవం ఉంటుందని మూడవ కాలంలో భక్తుల అభిషేక సేవలను అనుమతిస్తున్నట్లు ఇఓ వివరిచారు.

## జనవరి 3న నారావారిపల్లిలో మెగా జాబ్ మేళా

-ఎమ్మెల్యే పులివర్తి నాని

తిరుపతి,డిసెంబర్ 29 ప్రభాతవార్త:



చంద్రగిరి నియోజకవర్గ నిరుద్యోగ యువతకు ఉద్యోగ రూపకల్పన దిశగా ఎమ్మెల్యే పులివర్తి నాని అడుగులు వేస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామనే హామీ మేరకు జనవరి 3న నారావారిపల్లిలోని టిటిడి కళ్యాణ మండపంలో మెగా జాబ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మెగా జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ ఏపి స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో 20కిపైగా కంపెనీలతో మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 5వ తరగతి నుండి ఉన్నత చదువులైన బిటెక్, ఎంబిఎ తదితర కోర్సులు పూర్తి చేసిన నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గంలో 39గ్రామాలకు రోడ్ల సమస్య ఉందని, రానున్న రోజులలో అన్ని గ్రామాలకు 100శాతం సిసి రోడ్లు వేస్తామని తెలిపారు. గంజాయి, మత్తు పదార్థాల నివారణకు కృషి చేస్తామని తెలిపారు. ప్రతిపక్షం పనలేని మాటలు పట్టించుకోనని, నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సంక్షేమం కోసమే కృషి చేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఎ.ఈశ్వరరెడ్డి, క్రిష్ణమూర్తిరెడ్డి, అలిమినేని మధు, శ్రీధర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ నివారణకు పరిశోధనలు పెరగాలి

సిమ్స్ డైరెక్టర్, వీసీ డాక్టర్ ఆర్వీ కుమార్

తిరుపతి విద్య డిసెంబర్ 29 ప్రభాత వార్త:



క్యాన్సర్ నివారణకు సరికొత్త పరిశోధనలు పెంచాల్సిన అవసరం ఉందని స్విమ్స్ డైరెక్టర్, వీసీ డాక్టర్ ఆర్వీ కుమార్ పేర్కొన్నారు. ఎస్వీయూ బయోటెక్నాలజీ విభాగం, అమెరికా అలభామా వర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో బయోటెక్నాలజీ, మెడిసిన్స్, ప్రివెన్షన్ ఆఫ్ క్యాన్సర్, థెరిఫి అనే అంశంపై గత మూడు రోజుల పాటు జరిగిన అంతర్జాతీయ సదస్సు ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ క్యాన్సర్ నివారణకు ఆంకాలజీ విభాగం రోజు రోజుకి అభివృద్ధి చెందుతుందన్నారు. వ్యాధి నివారణకు అనేక రకాల అడ్వాన్స్ చికిత్సలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఊపిరి తిత్తుల క్యాన్సర్ కు అనేక రకాలైన జన్యుపరమైన వైవిధ్యాలను బయోటెక్నాలజీ ద్వారా గుర్తించారని అన్నారు. బయోటెక్నాలజీతో వణుకుడు రుగ్మతలుకు సైతం ఖిమావి లోని మూల కణాలుఖి ద్వారా నయం చేయవచ్చని చెప్పారు. అనంతరం సదస్సుకు హాజరైన అతిథులను నిర్వాహకులు సత్కరిం చారు. వర్సిటీ ఫార్మా కాలేజీ ప్రిన్సిపాల్ ఓవి రెడ్డి, సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ సరిత, మిథున్, ఒప్పంద అధ్యాపకుడు జ్యోతి కుమార్, దేశ విదేశాల పరిశోధకులు, వర్సిటీ విద్యార్థులు పాల్గొన్నారు.

## భగవద్గీత పారాయణం బాల్యదశ నుంచే అలవరచుకోవాలి

తిరుపతి విద్య, డిసెంబర్ 29 ప్రభాత వార్త:



భగవద్గీత పారాయణం బాల్యదశ నుంచే విద్యార్థులు అలవరచుకోవాలని జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి తెలిపారు. ఆదివారం వర్సిటీలో గీతాజయంతిని పురస్కరించుకుని భగవద్గీత శ్లోకాలపై నిర్వహించిన పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆయన బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ భగవద్గీత పారాయణం పిల్లలకు అలవాటు చేయాల్సి బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యార్థులలో భక్తిభావం, పెద్దల పట్ల గౌరవం, క్రమశిక్షణ అలవడుతుందన్నారు. ఎల్ కేజీ నుంచి పదవ తరగతి వరకు జరిగిన ఈ పోటీలలో ప్రతిభ చూపిన 20మంది విద్యార్థులకు ఆయన ప్రశంసాపత్రం, బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రీడా భారతి సౌత్ జోన్ సెక్రటరీ చంద్రశేఖర్ జాగిర్దార్, వర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రమాదాలకు నిలయంగా మారిన ఒరూరు రోడ్డు

విజయపురం, డిసెంబరు 29 ప్రభాతవార్త:



మండలంలోని ఒరూరు వద్ద తిరుపతి–నాగలాపురం రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. ఒరూరు మలుపు మర్రి చెట్టు వద్ద లోతట్టు ప్రాంతం కావడంతో వర్షపునీరు నిలిచి పెద్ద లోయలా తయారై వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉందని గ్రామస్తులు ఆరోపణలు చేస్తున్నారు. ఆ రోడ్డులో కొత్తగా ప్రయాణం చేసే ప్రతి ఒక్కరు ప్రమాదాల బారిన పడుతున్నారని, నిత్యం ప్రమాదాలు సంబవిస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఒరూరు రోడ్డును మరమ్మతు చర్యలు నిర్వహించాలని కోరుతున్నారు.

## మరమ్మతులకు నోచుకోని వంక కాలువ

రోడ్డుపై పారుతున్న వరద నీరు

విజయపురం, డిసెంబరు 29 ప్రభాతవార్త:



మండలంలోని ఆలపాకం–ముత్తుప్రరెడ్డి కండ్రిగ సమీపంలోని వంక కాలువను మరమ్మతు చర్యలు నిర్వహించాలని గ్రామస్తులు కోరుతున్నారు. సంవత్సరాల తరబడి మరమ్మతు చర్యలు నిర్వహించక పోవడం వలన తేలికపాటి వర్షాలకే వరద ఉధృతి నీరు తిరుత్తని–నాగలాపురం రోడ్డుపై ప్రవహిస్తున్నదని వాపోతున్నారు. వర్షం కురుస్తున్న ప్రతిసారి ప్రయాణికులకు ఇబ్బంది తప్పడం లేదని ఆరోపణలు చేస్తున్నారు. అధికారులు స్పందించి మరమ్మతు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## సెయింట్ జేవీయర్ పాఠశాల విద్యార్థుల ఆత్మీయ సమావేశం

శ్రీకాళహస్తి,డిసెంబర్ 29 ప్రభాతవార్త




శ్రీకాళహస్తిలోని సెయింట్‌జేవీయర్ పాఠశాల విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. 2004–25 సంవత్సరం పదవ తరగతి చదివిన విద్యార్థులు 20 సంవత్సరాల తరువాత కలుసుకున్నారు. ఈ అనుభూతి చెప్పలేనిదని అభివర్ణించారు. స్నేహితుల కళ్ళలో ఆనందం వర్ణించనలవి కానిదిగా కనబడింది. 20 సంవత్సరం తరువాత కలుసుకున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆనాటి మధుర స్మృతులను జ్ఞాపకం చేసుకుంటూ అనందంగా గడిపారు. గురువులకు పాఠశాల ఆవరణలో పెద్ద బహిరంగ సభను ఏర్పాటు చేసారు. వక్తలు మాట్లాడుతూ సెయింట్‌జేవీయర్స్ పాఠశాల ఆవరణలో ఇలాంటి సమావేశం జరగటం అనందదాయకంగా ఉందన్నారు. ఈ కార్యక్రమాల్లో పూర్వ విద్యార్థులు అశోక్, వసంత; వివ, రవి, నజీర్, అశ్విని, గాయత్రి, నదియ, కీర్తి, జోత్స్న శ్రీలక్ష్మీ, వర్ధిని, శశికళ, బాలాజి, అనుదీప్, ప్రమోద్, కిషోర్, కళ్యాణ్ తదితరుల పర్యవేక్షణలో కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపల్ సిస్టర్ షర్లిన్, పూర్వ ఉపాధ్యాయులు రవి, హేమలత, శ్రీనివాసులు, లేఖనాదం, అనిత, కిషోర్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రికి రెండు కొత్త రోడ్లు:ట్రాఫిక్ క్రమబద్దీకరణకు చర్యలు

ఎంఎల్ఏ సూచనలతో యుద్ద ప్రాతిపదికపై ఆర్‌డిఓ పరిశీలన

శ్రీకాళహస్తి,డిసెంబర్ 29ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఫిబ్రవరిలో ప్రారంభమయ్యే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు సన్నాహాలు చేపట్టారు. ఆదివారం ఆలయ ఇఓ టి.బాపిరెడ్డి శ్రీకాళహస్తి ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డి, ఇఇ మురళీధర్‌రెడ్డిలు సిబ్బందితో కలిసి రోడ్ల నిర్మాణాలకు సంబంధించి పరిశీలించారు. 13రోజుల పాటు జరిగే శివయ్య పండగను ఘనంగా నిర్వహించాలని భక్తులు, ప్రజలు మెచ్చేరీతిలో నిర్వహించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఆలయ పరిసరాలను అందంగా తీర్చి దిద్దాలని భావిస్తున్నారు. ఈనేపథ్యంలో సన్నిధివీధిలో వాహనాలను అనుమతించకుండా కొత్త రోడ్డును నిర్మించాలని భావించారు. గతంలో 2017లో స్వర్ణముఖి ఆనకట్ట మీదుగా కొత్త రోడ్డును నిర్మించుటకు పరిశీలించారు. కానీ అప్పటిలో రాజకీయంగా దానిని అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం శాసనసభ్యుడు బబొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి సూచనలతో ఇఓ బాపిరెడ్డి జలవినాయకుని ఆలయం ఎదురుగా ఉన్న ఓ ప్రైవేటు స్టార్ హోటల్ పక్కనే స్వర్ణముఖి ఆనకట్ట ఉంది. ఈ ఆనకట్ట మీదుగా రోడ్డు నిర్మాణానికి నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఆదివారం అధికారులు రోడ్డు నిర్మాణాన్ని పరిశీలించారు. ఆనకట్ట మీదుగా 40 అడుగుల రోడ్డును టూరిస్టు బస్టాండు వరకు పంపనున్నారు. మొదట శివరాత్రి లోపల కచ్చా రోడ్డు నిర్మించాలన్నది అంచనా. కాగా మరో రోడ్డు బిక్షాల గాలిగోపురం నుంచి శ్రీరామమందిరం వరకు 60 అడుగుల రోడ్డును నిర్మించుటకు యుద్ద ప్రాతిపదికపై పనులు నిర్వహిస్తున్నారు.

**కొద్దిగా భూసేకరణ చేయాల్సి ఉంది: ఇఓ**

శ్రీకాళహస్తీశ్వరాలయం కొత్తగా స్వర్ణముఖి నది ఒడ్డున కర కట్ట మీదుగా కొత్తగా రోడ్డును నిర్మించుటకు ప్రతిపాదించి ఆదివారం పరిశీలించారు. ఈ నేపథ్యంలో కరకట్ట టూరిస్టుబస్టాండు మధ్య 17సెంట్ల భూమిని సేకరించాల్సి ఉందని ఇఓ బాపిరెడ్డి వివరించారు. త్వరలోనే పొలం వారితో చర్చిస్తామన్నారు. వాహనాల మండపం నుంచి కొత్త రోడ్డును నిర్మించనున్నారు. మహాశివరాత్రికి రెండు రోడ్లను పూర్తి చేయటానికి చక చకా పనులు చేపట్టారు. ఈ పరిశీలనల్లో ఇఇ మురళీధర్‌రెడ్డి, డిఇఇ శ్రీనివాసులురెడ్డి, ఎఇ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## మాటతప్పని మంచి ప్రభుత్వం

ఎంఎల్ఏ పులివర్తి నాని

రామచంద్రాపురం, డిశంబర్ 29 ప్రభాతవార్త:



తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం మాటతప్పని మంచి ప్రభుత్వమని ఎంఎల్ఏ పులివర్తి నాని అన్నారు. ఆదివారం రాయలచెరువులో 13వ జాతీయ డ్రాగన్ బోట్ ఛాంపియన్ షిప్ క్రీడల శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రాయలచెరువు కట్టపై క్రీడాకారులను పరిచయం చేసుకుని యూనిఫామ్ అందజేశారు. క్రీడాకారులతో కలసి బోట్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలచెరువులో జాతీయ స్థాయి పోటీల నిర్వహణకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సి క్యాప్ చైర్మన్ ప్రదీప్ నాయుడు మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు జనవరి 3 నుండి 6 వరకు ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారని అన్నారు. జాతీయ స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు త్వరలో చైనాలో జరిగే అంతర్జాతీయ క్రీడలలో పాల్గొంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి, రాయలచెరువు సాగునీటి సంఘం ఉపాధ్యక్షుడు త్యాగరాజులు, నాయకులు తానికొండ కేశవులు నాయుడు, జనార్ధన్ చౌదరి, ఉమబాపతి నాయుడు, నరశింహారెడ్డి, కోరా హరిప్రసాద్, విజయ్‌కుమార్ రాయల్, సురేంద్ర నాయుడు, మహేష్ నాయుడు, మురళీమోహన్ రెడ్డి, తహశీల్దార్ వెంకటరమణ, ఎంపిడిఓ ఇందిర, తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి మండల అధ్యక్షుడుగా జనార్ధన్ నాయుడు

రామచంద్రాపురం, డిశంబర్ 29 ప్రభాతవార్త:



భారతీయ జనతా పార్టీ (బిజెపి) మండల అధ్యక్షుడుగా ఎన్ఆర్ కమ్మపల్లికి చెందిన నరసాని జనార్ధన్ నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం రాయలచెరువు కట్ట సమీపంలోని రాయల మండపడంలో బిజెపి కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి చిత్తూరు పార్లమెంటరీ బిజెపి కార్యదర్శి కాయం హరినాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ఎంపిక జరిగింది. ఈ సందర్భంగా జనార్ధన్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కార్యకర్తలతో కలసి పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కిసాన్‌మోర్చా అధ్యక్షుడు ప్రభాకర్ నాయుడు, కార్యదర్శి శ్రీదర్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

## అఖిల భారత మహాసభ విజయవంతం

సత్యవేడు, డిసెంబరు 29 ప్రభాతవార్త:



సత్యవేడు నియోజకవర్గంలో అఖిలభారత యోజన సమాఖ్య నియోజకవర్గ 4వ మహాసభ నిర్వహించారు. ఈ మహాసభకు అధ్యక్షత నాగార్జున వహించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కత్తి రవి హాజరయ్యారు. ఈ సందర్భంగా కత్తి రవి మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలు అర్పించిన భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖదేవ్, చంద్రశేఖర్ ఆజాద్, అల్లూరి సీతారామరాజు, లాంటి యువ కిషోరాలు బ్రిటిష్ సేనను ఎదిరించింది. వారి స్ఫూర్తితో నాటినుంచి నేడు వరకు ఏఐవైఎఫ్ అలుపెరగని పోరాటాలు చేస్తున్నదన్నారు. శాంతి, అభ్యుదయం, శాస్త్రీయ సోషలిజం కోసం శ్రమిస్తున్నదని, 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకు లు ఓటు హక్కు కోసం విద్య, వైద్య, ఉపాధి కోసం ఉద్యమాలు చేస్తుందన్నారు. స్థానిక శ్రీసిటీ లో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, వయో పరిమితి పెంచాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. అనంతరం సత్యవేడు నియోజకవర్గ నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది. నియోజకవర్గ అధ్యక్షులుగా మురళి, ఉపాధ్యక్షులుగా ప్రతాప్, నవీన్, సాధమయ్య, సురేష్, నియోజకవర్గ కార్యదర్శిగా నాగార్జున, సహాయ కార్యదర్శిగా దిండు విధిష్, మునిశేఖర్, వెంకటేష్, కతరి తరుణ్ కుమార్, కోశాధికారి సుబ్బులను ఎన్నుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్‌సంఘం క్యాలెండర్లు ఆవిష్కరణ

సత్యవేడు, డిసెంబరు 29 ప్రభాతవార్త:



సత్యవేడు ముదిరాజ్ సేవా సంఘం ఆధ్వర్యంలో క్యాలెండర్‌ని ఆవిష్కరించారు. ఆదివారం స్థానిక మఠం భూపతి శివ ఆలయ ప్రాంగణంలో ముదిరాజ్ సేవా సంఘం మండల అధ్యక్షులు మురళి(చికెన్ చిన్న) ఆధ్వర్యంలో సంఘం సభ్యులు పలువురు ముదిరాజ్ సేవా సంఘం కాల పట్టికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సేవా సంఘం మండల అధ్యక్షుడు మురళి మాట్లాడుతూ తమ సేవా సంఘం ఇప్పటికే పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. ఈ నేపథ్యంలోనే 2025 నూతన సంవత్సరం సందర్భంగా క్యాలెండర్‌ని విడుదల చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సేవా సంఘం నాయకులు నారాయణ, తులసి, మునస్వామి, మనీ, సిద్ధయ్య, కిరణ్, గంగ కల్యాణ మండపం వెంకటేశులు, రామారావు, రాము, శివయ్య, నాగరాజు, శంకరయ్య, పరందామయ్య తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారి సేవలో ఎంఎల్‌సి భరత్



తిరుమల,డిసెంబర్ 29 ప్రభాతవార్తప్రతినిధి:

శ్రీవేంకటేశ్వరస్వామిని ఎంఎల్‌సి భరత్ ఆదివారం ఉదయం దర్శించుకుని, ఆశీస్సులం దుకున్నారు.

## ప్రజలకు సంక్షేమ పథకాలపై అవగాహనకు

మన్‌కీబాత్ దోహదం

తిరుపతి(రవాణ),డిసెంబర్ 29ప్రభాతవార్త:



కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం, ప్రధాని మోదీ ప్రజలకు అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజల ఆర్థికాభివృద్ధికి చేస్తున్న మంచి పనులపై అవగాహనకు మన్‌కీబాత్ ఎంతో ఉపయోగకరమని బిజెపి నేత గుండాల గోపీనాథరెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం ప్రధాని మన్‌కీ బాత్ మంచి విషయాలను పార్టీ కార్యాలయంలో వీక్షించారు. గుండాల గోపీనాథరెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, మురళి, సుబ్రమణ్యంయాదవ్, సుభద్రమ్మ, వెంకటరత్నం, ప్రసాద్, రామకృష్ణ తదితరులు ఉన్నారు

## 31న సరిగమప పార్టీకి వేళాయే

తిరుపతి(రవాణ),డిసెంబర్ 29ప్రభాతవార్త:

వినోదం, విజ్ఞానంతో తెలుగుప్రేక్షకులను అలరిస్తున్న జీ తెలుగులో ఏడాది చివరగా 31వతేదీ రాత్రి 10గంటలకు సరిగమప పార్టీకి వేళాయేరా, జనవరి 1నుండి చామంతి నూతనంగా ప్రారంభమవుతున్నాయి. తెలుగుప్రేక్షకులకు 31ఏడాది చివరన ఈ కార్యక్రమం ఎంతగానో ఆకట్టుకుంటుందని ప్రతినిధి ప్రసాద్ గుప్త తెలిపారు. నూతన సంవత్సరానికి స్వాగతం పలకడానికి సిద్దమన్నారు. కొత్తసీరియల్ చామంతి 1వతేదీ నుండి ప్రతిరోజూ రాత్రి 8.30గంటలకు జీతెలుగులో ప్రసారమవుతుందన్నారు.

## బ్రిడ్జ్‌పై ఎట్టకేలకు రోడ్డు నిర్మాణం పూర్తి..



పాకాల, డిసెంబర్ 29, ప్రభాతవార్త

పాకాల నుండి మద్దినా యన పల్లికి వెళ్లే దారిలో సూరినేనిపల్లి, బుల్లయ్య గారి పల్లి మధ్యలో పాకాల వంకపైన ఉన్న రోడ్డు గుంతలమయం కావడంతో ప్రజలు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు అని

### వార్తకు స్పందన

వార్త పేపర్లో వచ్చిన కథనం మేరకు స్పందించిన అధికార యంత్రాంగం ఎట్టకేలకు బ్రిడ్జి పై తారు రోడ్డు నిర్మాణం పూర్తి చేసారు. అధికారులు స్పందించిన తీరుపై ప్రజలు, వాహనదారులు, బీజేపీ నాయకుడు వెంకటాద్రి నాయుడు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**PASSPORT MISSING**

I,**Shaik Rafeek Ahamed,** S/o Shaik Abdul Kareem, D.No.7-221, Kothapeta, Srikalahasti Town, Tirupati Dist, A.P. **I lost my original Passport bearing No. HYD R02187692,** on 25-11-2024 at about 10.00am, When I am going to get Xerox copy of the same near Ambedkar Circle, Srikalahasti. My efforts it is not traced out, so as to enable me to apply for the Duplicate Passport.

## 31న హద్దుమీరితే కఠిన చర్యలు- వాకాడు సిఐ



కోట, డిసెంబర్ 29 ప్రభాతవార్త

నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా పోలీసుశాఖ పలు సూచనలు చేసింది. ఈ నెల 31న రాత్రి బహిరంగ ప్రదేశాల్లో, రహదారులపై వేడుకలు నిర్వహించరాదని వాకాడు సిఐ హుస్సేన్‌బాషా హెచ్చరించారు. ఆదివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ 31న రాత్రి పోలీసు బృందాలు నిరంతరం గస్తీ తిరుగుతూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, ప్రమాదాలు జరగకుండా వాహనాలు తనిఖీలు చేస్తారన్నారు. 31న అర్ధరాత్రి 1 గంటల తర్వాత ప్రజలెవరూ రహదారులపై తిరగరాదన్నారు. బహిరంగ ప్రదేశాల్లో పార్టీలు, కేక్ కట్ చేయడం, బాణాసంచా కాల్చడం నిషేధమన్నారు. డిజె, లౌడ్‌స్పీకర్లు పెట్టి ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా నృత్యాలు చేయకూడదన్నారు. మద్యం దుకాణాలు ప్రభుత్వం నిర్ణయించిన సమయం వరకు మాత్రమే నిర్వహించాలని సూచించారు. వేడుకల సందర్భంగా అశ్లీల నృత్యాలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం సేవించడం, సైలెన్సర్లు లేకుండా వాహనాలు నడపకూడదన్నారు. ర్యాష్ డ్రైవింగ్, త్రిపుల్ రైడింగ్ చేస్తే ఆ వాహనాలు సీజ్ చేస్తామన్నారు.

## పద్మశాలి ఉద్యోగస్తుల సంక్షేమ సంఘం సేవలు అభినందనీయం

### చైర్ పర్సన్ నక్క భానుప్రియ



వెంకటగిరి, డిసెంబర్ 29, ప్రభాతవార్త

పద్మశాలి ఉద్యోగుల సంక్షేమ సంఘం వారు చేస్తున్న సేవలు అభినందనీయమని చైర్ పర్సన్ నక్క భానుప్రియ తెలిపారు. బడిమల నాగయ్య జూనియర్ కళాశాలలో పద్మశాలి కుల ఉద్యోగుల సంక్షేమ సంఘం వారు రూపొందించిన 2025 నూతన క్యాలెండర్‌ను చైర్ పర్సన్, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంగాధర్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పద్మశాలి కుల ఉద్యోగుల సంక్షేమ సంఘం ద్వారా అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వారు చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీరామ నాగేశ్వరరావు, సంఘ నాయకులు మాడా వేణు, బోడా సూరిబాబు, కాసుల రవికుమార్, పురుషోత్తం, వెంకటేశ్వర్లు, ఉక్కడాల శ్యాము, బోడా రమణయ్య, పొట్టా బాలాజీ, మునికోటి, బడిమల రాజేంద్ర కుమార్, గొట్టిముక్కల రామచంద్రయ్య, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బలిజ చేయూత ఫౌండేషన్ ద్వారా విరివిగా సేవా కార్యక్రమాలు

### కార్యదర్శి గుండు మనోజ్ కుమార్



వెంకటగిరి, డిసెంబర్ 29, ప్రభాతవార్త బలిజ చేయూత ఫౌండేషన్, శ్రీకృష్ణదేవరాయ కాపు సంఘం ద్వారా విరివిగా సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం కార్యదర్శి గుండు మనోజ్ కుమార్ తెలిపారు. అరుణ జ్యోతి అనే విద్యార్థినికి 12 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని బలిజ చేయూత ఫౌండేషన్ వారు అందజేశారు. తమ సంఘం ద్వారా బలిజ కాపు కులస్తుల్లో ఇబ్బంది పడుతున్న వారిని ఆదుకుంటామని ఆయన తెలిపారు. పేద విద్యార్థులకు కూడా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. గౌరవ అధ్యక్షులు డాక్టర్ ఫకీరుగారి గోపాల్, వైస్ ప్రెసిడెంట్ రామారావు బాలసుబ్రమణ్యం, కార్యవర్గ సభ్యులు అడపాల రాము, తమటం వెంకటేష్, సంపత్, ధనంజయ, తులసి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## ఘర్షణలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు

### డి.ఎస్.పి రమణ కుమార్

బాలాయపల్లి, డిసెంబర్ 29, ప్రభాతవార్త



ఘర్షణలకు పాల్పడే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని డి.ఎస్.పి రమణకుమార్ తెలిపారు. మున్నూరు గ్రామంలో భూ వివాదంపై రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణ కేసులో డిఎస్పి విచారించారు. ఘర్షణకు గల కారణాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి సమస్యకు చట్టం ఉందని చట్ట ప్రకారం పోవాలని తెలిపారు. ఘర్షణలకు దిగితే చర్యలు చెప్పమని తెలిపారు . గ్రామంలో గురువర్గాల వారిని విచారించారు. వివాదంలో ఉన్న భూమిని పరిశీలించారు. ఆయన వెంట ఎస్సై కామినేని గోపి ,సిబ్బంది ఉన్నారు. ఫోటో

## ఘనంగా ముగిసిన యాన్యువల్ ఎన్‌సిసి శిక్షణ క్యాంప్

కోట, డిసెంబర్ 29 ప్రభాతవార్త



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో కంబైన్డ్ యాన్యువల్ ట్రైనింగ్ క్యాంప్ ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణా తరగతులకు వివిధ జిల్లాల నుంచి 406 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. విద్యార్థులకు శారీరక మానసిక, సామాజిక అభివృద్ధి, దేశభక్తి, క్రమశిక్షణ, జాతీయ సమైక్యత, సోదరభావంతో పాటు ఫైరింగ్, ఫస్ట్ ఎయిడ్, హెల్త్, హైజిన్, కెరియర్ గైడ్ వంటి కార్యక్రమాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. అనంతరం క్యాంప్ కమాండర్ గణేష్ గోడందవె మాట్లాడుతూ తమ క్యాంప్ విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించిన కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి ఆఫీసర్ సబ్ లెఫ్టినెంట్ మల్లికార్జునరెడ్డి, గోవిందు మాధవ్, కోఆర్డినేటర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యాపారులు సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

కోట, డిసెంబర్ 29 ప్రభాతవార్త

ఎక్కడ నేరం జరిగినా ఆ దృశ్యాలు ఏదో ఒకచోట సిసి కెమెరాల్లో రికార్డయ్యేలా చూడాలని జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశించారు. ఆ మేరకు ఆదివారం కోట మండలం విద్యానగర్, కోట, కోట క్రాస్‌రోడ్డులో పలువురు వ్యాపారులు, బంగారు దుకాణదారులు సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్‌ఐ పవన్ కుమార్ నోటీసులు అందజేశారు. ట్రాఫిక్ రద్దీ ఉండే ప్రాంతాల్లో ప్రభుత్వమే సిసి కెమెరాలు మంజూరు చేస్తుందని, కమర్షియల్ ప్రాంతాల్లో ఆయా వ్యాపారులు ముందుకొచ్చి సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే అపార్టుమెంట్లలో నివాసం ఉండేవారు, దూరంగా ఉండేవారు సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. హెడ్‌కానిస్టేబుల్ కృష్ణమూర్తి వ్యాపారులకు నోటీసులు అందజేశారు.

# గూడూరు డివిజన్

## ఫ్లెమింగో ఫెస్టివల్ తేదీలపై త్వరలోనే స్పష్టత

### - సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ



సూళ్లూరుపేట, డిసెంబర్ 29 ప్రభాతవార్త

జనవరి నెలలో సూళ్లూరుపేట కేంద్రంగా నిర్వహించ తలపెట్టిన ఫ్లెమింగో ఫెస్టివల్ తేదీలపై త్వరలోనే స్పష్టరానుందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. ఆదివారం ఆమె విలేఖరులతో మాట్లాడుతూ ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహించేందుకు జనవరి నెలలో పండుగలు, ఇతర కార్యక్రమాలు ఉండటంతో తేదీల మార్పు విషయం అధికారికంగా ప్రకటన ఇస్తారని తెలిపారు. ఫిబ్రవరి నెల అన్నింటికీ అనువుగా ఉంటుందన్న దృష్టితో ఈ విషయమై తుది నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని ఆమె చెప్పారు.

## జ్వరం.. కలవరం

కోట, డిసెంబర్ 29 ప్రభాతవార్త

వాతావరణంలో మార్పులు, గత కొన్నిరోజులుగా కురిసిన వర్షాలతో మండలంలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. జ్వరాలతో బాధపడే వారి సంఖ్య పెరగ్గా, ప్రభుత్వ, ప్రైవేటు అనే తేడా లేకుండా ఆసుపత్రులన్నీ బాధితులతో కిటకిటలాడుతున్నాయి. కోట ఆసుపత్రికి 90 శాతం జ్వరపీడితులే వస్తున్నారు. చికున్ గున్యా, టైఫాయిడ్ వంటివి ఎక్కువ అవుతుండటం, చాలామంది సాధారణ జ్వరాలా, విషజ్వరాలా ? అని హడలిపోతున్నారు. కోట మండలంలోని విద్యానగర్, గూడలి, చిట్టేడు, వెంకన్నపాలెం, కొత్తపాలెం.. ఎటు చూసినా జ్వర పీడితులే అన్నట్లుగా పరిస్థితులు ఉన్నాయి. మరోపక్క జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తుందనే విమర్శలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం కరవయింది. ఎక్కడికక్కడ ఎఎన్‌ఎంలు ఫొటోలు తీసి యాప్‌లో పొందుపరచాలి. పంచాయతీ సిబ్బందితో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలి. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే తప్పనిసరి. మలేరియా విభాగంతో పాటు గ్రామాల్లో స్థానిక వైద్య సిబ్బంది తగిన ప్రచారం నిర్వహించడంతో పాటు జ్వరాలు విజృంభిస్తున్న ప్రాంతాల్లో రక్త నమూనాలు సేకరణ చేపట్టాల్సి ఉంది. కానీ, ఇవన్నీ మొక్కుబడిగా జరుగుతున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై మెడికల్ ఆఫీసర్ రూపాను 'ప్రభాతవార్త' ఫోన్‌లో వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు.

## హామీలు అమలకు మరో పోరాటానికి సిద్ధం కావాలి

### సి.ఐ.టి.యు జిల్లా అధ్యక్షులు జి. బాలసుబ్రమణ్యం

గూడూరు, డిసెంబర్ 29, ప్రభాతవార్త



గూడూరులోని సి.ఐ.టి.యు కార్యాలయంలో ఆదివారం రోజు ఏ.పీ.మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సి.ఐ.టి.యు) అనుబంధం ఆధ్వర్యంలో ఏ.పెంచల ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. విస్తృత సమావేశంలో సి.ఐ.టి.యు జిల్లా అధ్యక్షులు జి బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల హామీలు అమలకు మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి గూడూరు, వెంకటగిరి, నాయుడుపేట, సూళ్లూరుపేట, నుండి మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని మున్సిపాలిటీలలో జనరల్ బాడీ లు వేసి పోరాట ఆవశ్యకతను వివరించాల్సి ఉందని తెలియజేశారు. జిల్లా సి.ఐ.టి.యు ఉపాధ్యక్షులు అంగేరీ పుల్లయ్య మాట్లాడుతూ కార్మికులందరూ ఐకమత్యంతో సమస్యల సాధన మిలిటెంట్ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునివ్వడం జరిగింది. అనంతరం జిల్లా కమిటీ మార్పులు చేసి నూతనంగా కమిటీ ఎన్నుకోవడం జరిగింది. సవరించి ఎన్నుకోబడిన నూతన జిల్లా కమిటీ అధ్యక్షులు వి. చెంగయ్య, ఉపాధ్యక్షులుగా ఏ.రామయ్య, కార్యదర్శి బి.గోపీనాథ్, సహాయ కార్యదర్శి బి.పెంచల ప్రసాద్, వి పెంచలయ్య,కోశాధికారిగా సి.హెచ్ పలని,ఎన్నుకోవడం జరిగింది. కమిటీ సభ్యులుగా మరో ఎనిమిది మందిని ఎంపిక చేసారు. ఈ కార్యక్రమంలో సి.ఐ.టి.యు సీనియర్ నాయకులు బి.పద్మనాభయ్య, గూడూరు పట్టణ మున్సిపల్ కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు జోగి శివకుమార్, పట్టణ కార్యదర్శి ధారా కోటేశ్వరరావు, సి.ఐ.టి.యు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు, బి.వి.రమణయ్య, ఎస్.సురేష్, నాయకులు పామంజి మణి,ఏ. ప్రసాద్, కె.లక్ష్మయ్య,ఎస్. ముకుంద తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ నిర్వాకంతోనే ప్రజలపై విద్యుత్ భారం - ఎమ్మెల్యే విజయశ్రీ

సూళ్లూరుపేట, డిసెంబర్ 29 ప్రభాతవార్త



గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన పనుల వల్లే ప్రస్తుతం విద్యుత్ భారం ప్రజలపై అనివార్య పరిస్థితుల్లో పడుతుందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. ఆదివారం ఆమె క్యాంప్ కార్యాలయంలో విలేఖర్లతో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం ఏపీఈఆర్‌సీ ఇచ్చిన ప్రతిపాదనలను బుట్టదాఖలు చేసి వాటిని అమలు చేయకుండానే ఎన్నికలకు వచ్చేసిందన్నారు. దీంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఏపీఈఆర్‌సీ ప్రతిపాదనలను తప్పనిసరి పరిస్థితుల్లో అమలుచేయాల్సి వచ్చిందన్నారు. ఉమ్మడి రాష్ట్ర విభజన అనంతరం 2014లో 22.5 మిలియన్ల లోటుతో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని చెప్పారు. అనంతరం 2019 వరకు 2.19 మిలియన్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి ప్రజలకు అందజేశారన్నారు. 2019 నుంచి 2024 వరకు వైసీపీ ప్రభుత్వం విద్యుత్ ఉత్పత్తి చేయకుండానే బయట నుంచి కొనుగోలు చేయడంతో ప్రజలపై అదనంగా 32 వేల కోట్ల భారం మోపారన్నారు. ప్రస్తుతం నష్టాల ఊబి నుంచి విద్యుత్ రంగాన్ని బయట వేసేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో విద్యుత్ ఉత్పాదనకు ప్రయత్నాలు ప్రారంభించామన్నారు. ఒకవైపు రైతులకు 9 గంటల పాటు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తూనే, మరోవైపు విద్యుత్ లోటు పూడ్చేందుకు కృషి చేస్తున్నారన్నారు. కాగా, వీటన్నింటినీ పక్కనపెట్టి అబద్ధపు ప్రచారం చేస్తూ ధర్నాలు చేయడం వైసీపీకే చెల్లిందని విజయశ్రీ అన్నారు. ఈ సమావేశంలో టిడిపి నేతలు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, బొమ్మన్ పళణి, కొక్కు శంకరయ్య, మాధవనాయుడు, ఎజి కిషోర్, కె.శ్రీధర్, సెల్వం, అలవల శ్రీనివాసులు, శివకుమార్, మేడా సాయినారాయణ, వెంకటేశ్ యాదవ్, సంచి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

వెంకటగిరి, డిసెంబర్ 29, ప్రభాతవార్త



పవిత్ర ధనుర్మాసంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ధనుర్మాసం మరియు మార్గశిర మాసం ను పురస్కరించుకుని త్రైత సిద్ధాంతప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక శ్రీకాళహస్తి కమిటీ సభ్యులఆధ్వర్యంలో శ్రీ శ్రీ శ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు స్వామి రచించినటువంటి త్రైత సిద్ధాంత భగవద్గీత మరియు అనుబంధ ఆధ్యాత్మిక గ్రంథాలను పాల కేంద్రం , టీచర్స్ కాలనీలో ప్రచారం నిర్వహించారు. మార్గ శిర మాసంలో శిరము అనగా తల అని మార్గం అనగా దారి అని, తల లోనికి దారి అనే విధానం ఉన్నది అని ప్రతి ఒక్కరూ తెలుసు తెలుసుకోవాలని తెలిపారు. దీపావళి పండుగ అర్థం ప్రకారం గురువు యొక్క జ్ఞానాగ్ని ని పొందిన శిష్యుడు కార్తీక మాసం లో దీపవు వెలుగు లో అనగా యోగ మార్గం లో ప్రయాణించిన శిష్యుడు ఇక్కడ మార్గశిర మాసం లో తలలోని ఆత్మ వద్దకు చేరుటకు సులభముగా దారి ఏర్పడుతుంది అనేందుకు గుర్తు గా ఉంది కాబట్టి మార్గశిర మాసం లో ఎంతో భక్తి ప్రపత్తులతో ఉండాలి, దైవ భక్తితో గ్రంథ పఠనంతో జ్ఞానంలో ఉండాలని ప్రబోధించారు. మార్గంలో ప్రయాణించి జీవుడు తాను శూన్య మాసమైన ధనుర్మాసం లో గురువును శరణు వేడి తాను శూన్యంగా మిగిలిపోతే ఉత్తరాయణంలో మోక్షంనకు చేరగలడు అని తెలిపారు. కార్యక్రమం లో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక శ్రీకాళహస్తి కమిటీ అధ్యక్షుడు సభ్యులు చింత సుబ్రహ్మణ్యం సభ్యులు వెంకటలక్ష్మి, అమరావతిలు పాల్గొన్నారు.

## అల్లర్లకు పాల్పడే వారిపై చర్యలు

### సీఐ ఏవి రమణ



వెంకటగిరి, డిసెంబర్ 29, ప్రభాతవార్త

నూతన సంవత్సర వేడుకలు పేరుతో మద్యం సేవించి అల్లర్లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ఏవి రమణ తెలిపారు. ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జనవరి ఒకటో తేదీ పట్టణం ,గ్రామాల్లో పోలీసు నిఘా ఉంటుందని తెలిపారు. మద్యం సేవించి స్పీడుగా బైక్ రైడింగ్ చేయడం ఘర్షణలకు దిగడం వంటివి చేస్తే చర్యలు తప్పవన్నారు. వీధుల్లో గుంపులు గుంపులుగా తిరగరాదని సూచించారు. జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు సూచనల మేరకు నిఘ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా నూతన సంవత్సర వేడుకల్లో ప్రశాంతంగా చేసుకోవాలని సూచించారు.

## రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్‌చే ఆర్థిక సాయం

చిల్లకూరు, డిసెంబర్ 29, ప్రభాతవార్త



చిల్లకూరు దళితవాడలోని శంకరమ్మ అనే పేద మహిళ అనారోగ్యంతో ఆదివారం మరణించింది. ఆమెకు ఎవరూ లేకపోవడంతో పెట్టుబడి ఖర్చుల నిమిత్తం 10 వేల రూపాయలను రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధినేత రాజనేని శ్రీనివాసులు నాయుడు వెంటనే స్పందించి, గ్రామస్తుల ద్వారా అందించారు. అనేక విధాలుగా నిస్వార్థంతో పేద ప్రజలను ఆదుకుంటున్న ట్రస్టు అధినేత శ్రీనివాసులు నాయుడుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## గిరిజనులకు దుప్పట్లు, చీరలు పంపిణీ

చిల్లకూరు, డిసెంబర్ 29, ప్రభాతవార్త



చిల్లకూరు సమీపంలోని శారదానగర్ ప్రాంతంలో ఉన్న గిరిజన కాలనీలో పీపుల్ వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్టు అద్వర్యంలో గిరిజనులకు దుప్పట్లు, చీరలు, ఇతర దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం ట్రస్టు అధ్యక్షుడు పోతుగుంట మల్లికార్జున్ మాట్లాడుతూ ట్రస్టు ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిత్యం చేస్తున్నా మని, పేదలకు అండగా నిలవడమే ఈ ట్రస్ట్ యొక్క లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు నియోజకవర్గం రైతు ప్రధాన కార్యదర్శి కొండా రామచంద్రా రెడ్డి, టీడీపీ నాయకులు బెల్లంకొండ రాజా, గెద్ది మధు, కొట్టు సురేష్, బాల రమణయ్య, ట్రస్టు కార్యదర్శి విజయమ్మ, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సర వేడుకల్లో హద్దుమీరితే కఠిన చర్యలు

సూళ్లూరుపేట, డిసెంబర్ 29 ప్రభాతవార్త

నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా డిసెంబర్ 31వ తేదీన అర్ధరాత్రి నుంచి నిషేధాజ్ఞలు పట్టణంలో అమల్లో ఉంటాయని, వీటిని అతిక్రమించి హద్దుమీరి ప్రవర్తిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సూళ్లూరుపేట ఎస్‌ఐ బ్రహ్మానాయుడు ఆదివారం హెచ్చరించారు. మద్యం సేవించి రోడ్లపై తిరగడం, వేగంగా వాహనాలు నడపడం, డిజెలు, కేకులు కట్ చేయడం, బాణాసంచా కాల్చడం, గుంపులుగా తిరగడం వంటి చర్యలను ఎలాంటి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని సామరస్యపూర్వక వాతావరణంలో నూతన ఆంగ్ల సంవత్సర వేడుకలు జరుపుకోవాలని ఎస్‌ఐ విజ్ఞప్తి చేశారు.

## చిత్తూరు పార్లమెంటు పురోభివృద్ధే ఎంపి దగ్గుమళ్ల లక్ష్యం

**- పల్లె ప్రాంతాల ప్రగతికి రూ. 4.71 కోట్ల ఎంపి నిధులు**

**- గ్రామీణ ప్రాంతాల్లో శరవేగంగా సాగుతున్న సిసిరోడ్డు, డ్రైనేజీ నిర్మాణపు పనులు**

(చిత్తూరు – ప్రభాతవార్త)



ప్రజలు తనపై వుంచిన నమ్మకాన్ని వమ్ము కానివ్వకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి అందించిన ప్రోత్సాహంతో ఆయన ఆశయాలకు అనుగుణంగా చిత్తూరు పార్లమెంటు పురోభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు చిత్తూరు పార్లమెంటు సభ్యులు రిటైర్డు ఐఆర్‌ఎస్ అధికారి దగ్గుమళ్ల ప్రసాదరావు. కేవలం అరు నెలల కాల వ్యవధిలో చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గంలో దీర్ఘకాలికంగా వున్న సమస్యలకు చక్కటి పరిష్కార మార్గాలను చూపుతూ ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావు ప్రభాతవార్తతో మాట్లాడుతూ చిత్తూరు పార్లమెంటు సెగ్మెంట్లో రూ. 4.71 కోట్ల ఎంపి నిధులతో గ్రామీణ ప్రాంతాలకు మౌళిక వసతులు కల్పించినట్లు తెలిపారు. ఎంపి నిధులతో గ్రామాలకు సిసి రోడ్లు డ్రైనేజిల నిర్మాణంతో పాటు పలు చోట్ల కమ్యూనిటీ భవనాలను కూడా నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రోత్సాహంతో నియోజకవర్గంలోని అనేక సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించి ఈ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా జిల్లాలో మామిడి రైతులు ప్రతి ఏడాది ధరలు లేక నష్టపోతున్న నేపథ్యంలో మామిడి పంటకు గిట్టుబాటు ధర కల్పించడానికి మ్యాంగో బోర్డు, జిల్లా కేంద్రమైన చిత్తూరు నగరంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయాలని కేంద్రం దృష్టికి తీసుకెళ్లడంతో కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు వివరించారు. అలాగే సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామి మేరకు పాకాలలో రైల్వే కోచ్ డిపో ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరిగిందని, త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. పారిశ్రామికంగా జిల్లాను అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ఎంఎస్‌ఎంఈలపై ప్రత్యేక దృష్టి సారించి దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఢిల్లీ నుంచి ప్రత్యేక బృందాన్ని జిల్లా కేంద్రమైన చిత్తూరుకు తీసుకొచ్చి పలు సమావేశాల ద్వారా యువతకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. అలాగే చిత్తూరు రూరల్ మండలం దిగువమాసాపల్లి వద్ద అలాగే గంగాధర నెల్లూరు మండలంలోని చిన్న వేపంజేరి ప్రాంతాల్లో అండర్ బ్రిడ్జీ నిర్మాణాలను చేపట్టినట్లు తెలిపారు. అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజా సమస్యల పరిష్కార దిశగా కృషి చేస్తున్నట్లు ఎంపి ప్రసాదరావు తెలిపారు.

## దేశంలోనే నెంబర్‌వన్‌గా కుప్పం సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్

కుప్పం, డిసెంబర్ 29 ప్రభాతవార్త





ఆధునిక టెక్నాలజీ వినియోగంలో సిఎం చంద్రబాబునాయుడు తర్వాతే మరెవరైనా.. గతంలో కరువుకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే కుప్పం ప్రాంతంలో దేశంలోనే తొలిసారి ఇజ్రాయిల్ టెక్నాలజీని పరిచయం చేసి సక్సెస్ అయ్యారు.. అదే ఇజ్రాయిల్ టెక్నాలజీతో 2019లో కుప్పంలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (హార్టీకల్చర్ హబ్)ను ఏర్పాటుచేసి వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు సిఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారు. ఆయన ఐదేళ్ల క్రితం చూపిన చొరవతో నేడు కుప్పం సెంటర్ ఆఫ్ లెక్స్‌లెన్స్ (సిఒఇ) దేశంలోనే నెంబర్‌వన్ స్థాయికి చేరింది. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో 57 సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ కేంద్రాలు ఉండగా కుప్పం హార్టీకల్చర్ హబ్ తన అద్భుతమైన పనితీరుకు ప్రతిష్టాత్మక 'స్కోచ్' అవార్డును అందుకుని కుప్పం పేరు మరోమారు మార్మోగించింది. కుప్పం మండలం బంగానత్తం వద్ద 22.8 ఎకరాల్లో ఉన్న హార్టీకల్చర్ హబ్‌లో ఏర్పడింది. ఇక్కడ 19పాలీహౌస్‌లు, ఫారంపండ్, రెండు నీటి నిల్వ ట్యాంకులు, కోల్డ్ రూం, విషింగ్, గ్రేడింగ్ యంత్రాలు ఉన్నాయి. ఈ హార్టీకల్చర్ హబ్‌లోఅన్ని రకాల కూర గాయల పంటలకు చెందిన హైబ్రిడ్ వంగడాల నారు పెంచి రైతులకు అందిస్తారు. అలాగే మేలైన కూరగాయల మొక్క లకు అంటుకట్టి యాభై లక్షల నార్లను రైతులకు అందిం చారు. హైబ్రిడ్ బంతి విత్తనాల ఉత్పత్తి, కొత్త వంగడాలపై రైతులకు అవగాహన కల్పించడం జరుగుతోంది. రైతులు, అధికారులు, విద్యార్థులకు వివిధ పంటల సాగుపై శిక్షణ తరగతులు నిర్వహిస్తారు.

హార్టీకల్చర్ హబ్ ప్రత్యేకతలు : కుప్పం హబ్‌లో ఆధునిక సా ంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయ పద్ధతులు అవ లంబిస్తారు. డ్రిప్‌ఇరిగేషన్, పాలిహౌస్, సస్యరక్షణ పద్ధ తులు అమలు చేస్తారు. అలాగే రైతులు తక్కువ నీటితో ఎక్కువ దిగుబడులు పొందవచ్చు. కూరగాయలు, పళ్లు, పూల పంటలసాగుకు అనువైన వాతావరణం ఉంది. ఇక్కడ వ్యాధినిరోధక గ్రాఫ్టెడ్ కూరగాయల మొక్కలు, కొత్త కూరగాయల జాతుల మొక్కలు ఉత్పత్తి చేస్తారు. వంకాయ, సోయాబీన్స్, గుమ్మడికాయ, మస్క్‌మెలన్, గోల్డెన్ టమోటా, క్యాప్సికం, రెడ్ క్యాబేజ్, బీర, బెండకాయలతో పాటు చామంతి, మేరీగోల్డ్ పూల ఉత్పత్తులు సాగవు తాయి. రైతుల ప్రయోజనాల కోసం పిపిపి విధానంలో కార్యాచరణ చేపట్టడంతో పాటు రైతుల ఉత్పత్తి సంస్థలను బలోపేతం చేయడం జరుగుతోంది. ఇజ్రాయిల్ దేశ శాస్త్రవేత్తలు, నిపుణుల నుంచి రైతులకు శిక్షణ, సేంద్రీయ సాగుపై రైతులకు శిక్షణ కల్పిస్తారు.

దేశ,విదేశీ ప్రతినిధులకు శిక్షణ : కుప్పం సిఇఒలో ఇజ్రాయిల్, జపాన్, నెదర్లాండ్స్, తైవాన్, థాయ్‌లాండ్ వంటి దేశాల శాస్త్రవేత్తలు, రైతులతో పాటు మనదేశంలోని వివిధ రాష్ట్రాల ఉద్యానవన అధికారులకు ఇక్కడ శిక్షణ నిర్వహిస్తారు. ఇప్పటివరకు 43శిక్షణ తరగతులు 6వేలమంది దాకా రైతులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ హార్టీకల్చర్ హబ్ నర్సరీ ఉత్పత్తుల ద్వారా లాభాల బాటలో పయనిస్తోంది.

### రైతులకు మరిన్ని ప్రయోజనాలు కల్పించేలా కృషి – జిల్లా కలెక్టర్

రాష్ట్రంలో ఉద్యానవన రైతులకు అధిక లాభాలు తెచ్చిపెట్టేలా సిఎం చంద్రబాబునాయుడు దూరదృష్టితో కుప్పంలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌కు శ్రీకారం చుట్టారు. ఆధునిక టెక్నాలజీతో ఉద్యానవన పంటలసాగుతో రైతులు మరింత లాభాల బాటలో పయనించేలా అవసరమైన శిక్షణ తరగతులు నిర్వహించి మరింత ప్రయోజనం